
ఆదివారం
వార్త
11 ఆగస్టు, 2024
మువ్వన్నెల
వికసిత భారత్

# తారాతీరం

# 'కన్నప్ప'లో మధుబాల



మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'లో దిగ్గజ నటులు భాగస్వామ్యం అవుతున్న సంగతి తెలిసిందే. ఇందులో మోహన్‌బాబు, మోహన్‌లాల్, శరత్‌కుమార్, ప్రభాస్, అక్షయ్‌కుమార్, బ్రహ్మానందం, మధుబాల మొదలైనవారు నటిస్తున్నారు. ఈ సినిమా నుంచి బయటకొస్తున్న ఒక్కో అప్‌డేట్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ క్రమంలో 'కన్నప్ప' సినిమా మధుబాల లుక్ విడుదల చేసారు. చెంచుల వీరత్వాన్ని తెలిపేలా వున్న మధుబాల లుక్ అందరినీ ఆకట్టుకుంది. ఈ సినిమాని ముఖేష్‌సింగ్ దర్శకత్వంలో మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ షూటింగ్ చివరి దశకు చేరుకుంది.

# 'విడి12' మార్చిలో విడుదల?



తక్కువ సమయంలో ఎక్కువ క్రేజ్ సంపాదించుకున్న యంగ్ హీరో విజయ్ దేవరకొండ. చివరిసారిగా ఫ్యామిలీ స్టార్ చిత్రంలో కనిపించాడు. ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్లో చేస్తున్న ప్రాజెక్ట్ అతని కెరీర్‌లో 12వ సినిమా అవుతుంది. దీని తరువాత మరికొన్ని చిత్రాలు అంగీకరించినట్లు సమాచారం. విడి12 చిత్రం వచ్చే ఏడాది మార్చిలో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. త్వరలో ఈ సినిమా టైటిల్ ఫిక్స్ చేయనున్నట్లు సమాచారం. ఈ సినిమాకి అనిరుధ్ సంగీతం అందిస్తుండగా సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌వారు నిర్మాణం వహిస్తున్నారు. గతవారం విడి12 ఫస్ట్ లుక్ విడుదలైంది.

# ఆదివారం వార్త

11 ఆగస్టు, 2024


## మంచి ముత్యాలు

ప్రార్థన చేసే సమయంలో హృదయం లేని పదాలు కాదు, పదాలు లేని హృదయం కావాలి.

- బనియన్

## విషయ విశేషం


పోషకాల మొక్కజొన్న.. 4

'సంఘీ'భావం....5

ప్రకృతి ప్రకోపం వయనాడ్ విపత్తు

కవర్ స్టోరీ..6

మువ్వన్నెల వికసిత భారత్

చనిపోయినవారు తిరిగొస్తే....10

ఈవారం కవిత్వం..12

అంతే!

గోపాలుడు నడయాడిన....14

తగ్గుతున్న పుస్తక పఠనం....18

కథ.. 20

గూడు లేని గువ్వ

సాహిత్యం..23

తెలుగు అక్షరం ఎటు పోతోంది?

అనువుకాని చోట అధికులమనరాదు ...26

కలలు నిజమవుతాయా?... 29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం


వగైరా..వగైరా..


## తాజా వార్తలు

### అల్జీమర్స్‌కి 'ఏఐ' పరీక్ష మంచిది



అల్జీమర్స్‌ని ఏళ్ల ముందే గుర్తించే పరీక్షలు ఇటీవల కాలంలో కొన్ని వచ్చాయి. ఆయాసమయాల్లో అవి ప్రపంచంలోని అన్ని ఆసుపత్రులకీ అందుబాటులో లేవు. ఉన్న ఆసుపత్రుల్లోనూ వాటి ధర లక్షల్లో ఉంటోంది. అందుకే కృత్రిమ మేధ (ఏఐ)తో ఓ సులువైన పరీక్షా విధానాన్ని రూపొందించారు కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం పరిశోధకులు. మామూలుగా అల్జీమర్స్ సమస్యతో బాధపడుతున్నవాళ్లకి తరచూ ఎమ్మారై స్కాన్‌లూ, రకరకాల 'కాగ్నిటివ్' టెస్ట్‌లూ చేస్తుంటారు. అలా 400 మందికి చెందిన పరీక్షల వివరాల్ని ఈ సరికొత్త 'ఏఐ'కి ఫీడ్ చేశారట పరిశోధకులు. అల్జీమర్స్‌లేని వ్యక్తుల వివరాలూ దానికి అందించారు. వాటితో ఈ వ్యాధిపైన ఓ అవగాహనకి వచ్చేసిన ఏఐ..తనదైన విశ్లేషణలతో అద్భుతాలే చేస్తోందట. పదిహేను వందలమంది రోగుల వివరాలని విశ్లేషించి 82శాతం కచ్చితత్వంతో అల్జీమర్స్ వ్యాధిని పసిగట్టేస్తోందట. అదీ మూడేళ్ల ముందే చెప్పగలుగుతోందట. ఇలా అల్జీమర్స్‌ని



ముందస్తుగా పట్టిచ్చే వివిధ రక్తపరీక్షలకి అయ్యే వ్యయంలో కేవలం ఐదోవంతు ఖర్చుతోనే తనదైన పరీక్షని చేస్తోందట.




మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

# పోషకాల మొక్కజొన్న



**వానొస్తే** మొక్కజొన్నపొత్తు లేదా కంకి. సినిమాకి వెళితే పాప్‌కార్న్ రుచి చూడనివాళ్లు అరుదు. ప్రపంచవ్యాప్తంగా అందరికీ ఇష్టమైన స్నాక్ అంటే మొక్కజొన్న, కుక్కర్‌లో ఉడికించినా, నిప్పులపై కాల్చినా, గ్రిల్ చేసినా, సూప్‌లో కలుపుకున్నా, సలాడ్‌లా చేసుకున్నా..ఎలా అయినా సరే మొక్కజొన్న మొక్కజొన్నే. కాస్త తీపి మిళితమైన ఆ రుచే వేరు. కార్న్‌ని తక్కువ చేయడానికి వీల్లేదు. కేక్స్, కుకీస్, బ్రెడ్, చిప్స్, చాక్లెట్స్, ఐస్‌క్రీమ్, జామ్స్, బేబీఫుడ్, సెరిల్స్, ఛూయింగ్ గమ్స్, సూప్స్, డూనట్స్, పెట్‌ఫుడ్ ఇలా నాలుగు వేల ఆహార పదార్థాల్లో వాడుతున్నారు. ఆహారేతర పదార్థాల్లో కూడా కార్న్‌ని



వినియోగిస్తున్నారు. బ్యాటరీలు, డిటర్జెంట్లు, కాస్మొటిక్స్, ప్లాస్టిక్స్, షాంపూ, షూ పాలిష్, బ్లాంకెట్స్, ప్లేట్స్, కప్పులు, క్రేయాన్స్, పెట్‌పుడ్స్ తదితర పరిశ్రమల్లో కార్న్‌ని విరివిగా ఉపయోగిస్తున్నారు.

## మెక్సికోలో పుట్టింది

నేడు ప్రపంచమంతా కనిపించే మొక్కజొన్న సుమారు పది వేల ఏళ్లక్రితం మెక్సికోలో పుట్టింది. ఏపుగా పెరిగిన గడ్డికి ఉన్న కంకులను తొలిసారి ఆహారంగా తీసుకుంది అప్పటి నేటివ్ అమెరికన్లు. ఆ తరువాత అంతా పాకింది ఈ పంట. వంద గ్రాముల మొక్కజొన్న 365 క్యాలరీల శక్తిని అందిస్తుంది. అందుకే ఉదయం పాలతోపాటుగా, కార్న్‌ప్లేక్స్‌ను బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకునే దేశాలే అన్నీ. చాలా సంస్కృతుల్లో మొక్కజొన్నను మంచి ఆహారంగా భావిస్తున్నారు. ఉడికించిన, వేయించిన మొక్కజొన్నతో పాటు, కార్న్‌మీల్, కార్న్‌ఫ్లోర్, కార్న్ సిరప్‌లుగా వాడుతున్నారు. అయితే మొక్కజొన్నను ఎక్కువగా పండించే దేశాలలో అమెరికా, చైనా, బ్రెజిల్ అగ్రస్థానాల్లో ఉన్నాయి. ఔత్సాహిక రైతులు కొందరు అనేక రంగుల్లో కూడా మొక్కజొన్నను పండిస్తున్నారు. రంగును బట్టి 'బ్లాక్ పెర్ల్', 'పింక్ కార్న్' తదితర పేర్లు వచ్చాయి. కార్న్‌లో కార్బోహైడ్రేట్స్, ఫైబర్‌తోపాటు విటమిన్ల అధికం. అలాగే జింక్, మెగ్నీషియం, కాపర్, ఐరన్, మాంగనీస్‌లాంటి ఖనిజాలు కూడా ఉన్నాయి. మొక్కజొన్న పూర్తిగా జీర్ణం కావడానికి కాస్త సమయం తీసుకుంటుంది. అందుకే మధుమేహులకు మంచిది.

## ఆరోగ్య ప్రయోజనాలు

**జీర్ణశక్తి:** ఎక్కువగా ఫైబర్ ఉండడం వల్ల తిన్న ఆహారం సాఫీగా జీర్ణమయ్యేలా చేస్తుంది. 112 గ్రాముల పాప్‌కార్న్‌లో 16 గ్రాముల ఫైబర్ ఉంటుంది.

**గుండె పదిలం:** కొలెస్ట్రాల్ స్థాయుల్ని తగ్గించే ఆక్సిడెంట్లు మొక్కజొన్నలో ఉన్నాయి. ఇందులో ఉన్న పొటాషియం, ఫోలేట్, ప్లాంట్‌స్టెరాల్స్ కూడా గుండె ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. కార్బోహైడ్రేట్స్ వల్ల మొక్కజొన్న తిన్న వెంటనే నీరసంపోతుంది. ఉత్సాహంగా పనులు చేసేందుకు శక్తి వస్తుంది. కంటి ఆరోగ్యానికి అవసరమైన కరోటినాయిడ్స్ అవసరమైన కరోటినాయిడ్స్ మొక్కజొన్నలో ఎక్కువగా ఉంటాయి. ఇవి రెటీనాకు హాని కలగకుండా చూసుకుంటాయి. కళ్లకు సంబంధించిన వ్యాధుల నుంచి కాపాడతాయి. కాస్త మొక్కజొన్న తినండి..కడుపు నిండిన ఫీలింగ్ కారణం.. ఇందులో పీచు పదార్థాలు ఎక్కువ. పైగా కార్న్‌లో కొవ్వు, క్యాలరీలు తక్కువ. అందుకే బరువు తగ్గాలని అనుకునేవారి డైట్‌లో తప్పనిసరిగా ఉంటుంది. యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు మొక్కజొన్నలో ఎక్కువ. మెరిసే చర్మానికి ఇవన్నీ దోహదపడతాయి. వృద్ధాప్య ఛాయల్నీ తగ్గిస్తుంది. ఇందులో విటమిన్ సి అధికం. అందుకే రోగనిరోధక శక్తిని మొక్కజొన్న చెక్ పెడుతుంది. మొక్కజొన్నలో తగినంత స్థాయిలో ఐరన్ ఉంటుంది. రక్తహీనతతో బాధపడుతున్న వారికి మొక్కజొన్న చక్కటి పరిష్కారం. ఆరోగ్యానికి ఇంతలా దోహదపడే మొక్కజొన్నను ఇష్టమైన ఒక్కటే ఆహారంగా భావించకూడదు. తగు పాళ్లలో వేడివేడి మొక్కజొన్న ఆరగిస్తూ వానాకాలాన్ని ఆస్వాదించండి. మొక్కజొన్న గింజల నుంచి నూనెను కూడా తయారు చేస్తారు. ఇందులో కొలెస్ట్రాల్ తక్కువగా ఉంటుంది. వంట నూనెగా వాడతారు. సలాడ్, వేపుళ్లలో ఎక్కువగా వినియోగిస్తారు. స్పూను మొక్కజొన్న నూనె 122 క్యాలరీల శక్తిని ఇస్తుంది. ఇందులో 14 గ్రాముల కొవ్వు. 13శాతం విటమిన్ ఇ ఉంటుంది. కార్న్ ఆయిల్‌లో ఫైటోస్టెరాల్స్ అధికం. కాబట్టి యాంటీ ఇన్‌ఫ్లమేటరీగా పనిచేస్తుంది. గుండె వ్యాధులు, టైప్ 2 మధుమేహం, కొన్ని రకాల కేన్సర్లను నివారిస్తుంది. అయితే ఈ నూనెలను తక్కువ మొత్తంలో వాడడం మంచిది.

# 'సంఘీ' భావం



# ప్రకృతి ప్రకోపం వయనాడ్ విపత్తు

ప్రకృతిని సద్వినియోగం చేసుకుని చక్కటి ఫలితాలను పొందాల్సిన తరుణంలో అభివృద్ధి పేరుతో విధ్వంసాలకు పాల్పడితే కలిగే నష్టం ఏమేరకు ఉంటుందో వయనాడ్ దుర్ఘటన ఒక ఉదాహరణగా నిలుస్తుంది. దశాబ్దాల తరబడి పర్యావరణ శాస్త్రవేత్తలు, నిపుణులు కేరళలోని పశ్చిమ కనుమల్లో జరుగుతున్న విధ్వంసంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు బేఖాతరు చేశాయి. సుమారు రెండు దశాబ్దాల నుంచి ప్రకృతి విధ్వంసం యథేచ్ఛగా కొనసాగింది. 2010లో అప్పటి కేంద్ర పర్యావరణ శాఖ ఏర్పాటుచేసిన కమిటీ ఇలాంటి విపత్తు భవిష్యత్తులో రాబోతుందని స్పష్టంగా హెచ్చరించింది. పశ్చిమ కనుమలు అత్యంత సున్నితంగా ఉన్నాయని, ప్రకృతి పరంగా ఏర్పడిన ఈ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా అనర్థం కలుగుతుందని స్పష్టం చేసింది. అయితే ఈ అంశాన్ని పెడచెవిన పెట్టారు. వానాకాలంలో భారీవర్షాల కారణంగా కొండప్రాంతం నుంచి దిగువకు తీవ్రస్థాయిలో వత్తిడితో కలిగిన ప్రవాహం ముందుకు కదులుతుంది. మార్గమధ్యలో ఎలాంటి అడ్డంకులు లేకపోతే ఆ ప్రవాహం ఎలాంటి నష్టాన్ని కలుగచేయకుండా నేలకు చేరుకుంటుంది. కొన్ని శతాబ్దాల క్రితమే ఇలాంటి ప్రవాహాలకు అనుకూలమైన భూఉపరితలం ఏర్పడింది. ముఖ్యంగా మన దేశంలో హిమాలయాల్లోను, పశ్చిమ కనుమల్లో, నీలగిరి కొండల ప్రాంతంలో ఇలాంటి ప్రవాహాలు, కొన్ని సందర్భాల్లో కొండ చరియలు విరిగి పడటం జరుగుతూ ఉంటుంది. కొండ చరియలు సహజంగా పడటం కంటే మానవ చర్యలు ప్రధాన కారణంగా కనిపిస్తుంది. హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్, బంజారా హిల్స్ లో గరిష్టస్థాయిలో వర్షం కురిస్తే నీటి ప్రవాహంలో వాహనాలు సైతం కొట్టుకుపోతాయి. నీటి ప్రవాహానికి అడ్డంకులు కలిగిస్తూ ఇష్టారాజ్యంగా కొనసాగిన నిర్మాణాలు, కాలువలపై ఆక్రమణలు కారణం. ఇదే పరిస్థితి పశ్చిమ కనుమల్లో స్పష్టంగా కనిపించింది. కొండపైభాగం నుంచి వర్షం నీరు సునాయసంగా ప్రవహించడానికి ఉన్న మార్గంలో కట్టడాలు, డ్యామ్‌లు, వంతెనలు నిర్మించారు. బహుళ అంతస్తుల నిర్మాణం జరిగింది. దీనితోపై నుంచి వచ్చే ప్రవాహం దారిమళ్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనితో అడ్డువచ్చిన కట్టడాలను ధ్వంసం చేస్తూ, ప్రవాహం మళ్లింపు సమయంలో కొండచరియలను తోసుకుంటూ నీరు కిందకు వచ్చింది. సాధారణంగా వృక్షాలు నీటి ప్రవాహవేగాన్ని నిరోధించి సాధారణ స్థాయికి తీసుకువస్తాయి. వయనాడ్ సమీపంలోని కొండ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో వృక్షాలను నరికివేశారు. కొండచరియలు ఉన్న ప్రాంతాల్లో తవ్వకాలు, భారీ నిర్మాణాలు చేపట్టి ప్రకృతికి భిన్నంగా వ్యవహరించారు. పైగా ఈ ప్రాంతంలో గనులు, క్వారీల కోసం ఆధునాతన యంత్రాలు, భారీ వాహనాలు ఉపయోగించారు. దీనితో కొండపై భాగంలో రాళ్లు, మట్టిలో పటుత్వం లోపించింది. పై నుంచి పల్లానికి ప్రవహిస్తున్న నీటి వేగాన్ని ఇవి తట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా కొండ రాళ్ల కింద మట్టి, ఇసుక పేరుకుపోయి ఉంటుంది. స్థాయికి మించి వర్షం కురిసినప్పుడు మట్టి తడిసిపోయి పటుత్వం కోల్పోతుంది. అదేవిధంగా ఇసుక వర్షపు నీటితో పాటు కిందకు ప్రవహిస్తుంది. కొండచరియలపై ఇది సాధారణ స్థాయిలోనే ప్రారంభం అయినప్పటికీ కిందకు వచ్చే సరికి ఉధృతికి గురై పెద్దపెద్ద బండరాళ్లను సైతం దొర్లించుకుంటూ ముందు సాగుతుంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సాధారణంగా కొన్ని సంకేతాలు అందుతాయి. భూకంపం వచ్చే సమయంలో ముందుగా స్వల్ప కదలికలు ఉంటాయి. అదేవిధంగా సముద్రంలో తుఫానులు వచ్చినప్పుడు వాతావరణంలో స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. కొన్ని గంటల ముందు నుంచే నిశబ్ద వాతావరణం ఏర్పడుతుంది. తుఫాను సమయంలో వచ్చే ఇలాంటి మార్పులను మత్స్యకారులు స్పష్టంగా గుర్తిస్తారు. 24 గంటల ముందే పరిస్థితిని గ్రహించి చేపల వేటకు సముద్రంలో వెళ్లడాన్ని విరమించుకుంటారు. అదే విధంగా కొండచరియలు విరిగిపడటం, విపత్తును కలిగించే విధంగా ప్రవాహం వచ్చినప్పుడు ఇంట్లోని తలుపులు, కిటికీలు వాటంతట అవే బిగుసుకుపోతాయి. నేల, గోడల్లో పగుళ్లు కనిపిస్తాయి. స్థంభాలు, వృక్షాలు పక్కకు ఒరిగిపోతాయి. ఇలాంటి సంకేతాలు వచ్చినప్పుడు వెంటనే అప్రమత్తం అయితే ప్రాణనష్టాన్ని నివారించే అవకాశం కలుగుతుంది. ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా భవన, రోడ్డు నిర్మాణాలు చేపట్టడం వంటి చర్యలను విరమించుకోవాలి. గుజరాత్ నుంచి ప్రారంభమైన ఈ కనుమలు మహారాష్ట్ర, కర్ణాటక, గోవా, కేరళ మీదుగా తమిళనాడులోని కన్యాకుమారి వరకు సుమారు 16వందల కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయి. కృష్ణా, గోదావరి, కావేరి వంటి ప్రధానమైన నదులకు తుంగభద్ర, భీమా, మలప్రభ, ఘటప్రభ, హేమావతి, కాబిని వంటి అనేక ఉపనదులకు పుట్టినిల్లుగా ఉన్నాయి. మన దేశానికి ప్రకృతివరప్రదాయినిగా ఉన్న పశ్చిమకనుమలు రాజకీయ కారణాలతో అడ్డుఅదుపులేకుండా ఆక్రమణలకు గురౌతున్నాయి. కొండలను, వృక్షాలను నరికివేస్తూ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. సుప్రీంకోర్టు సైతం పశ్చిమ కనుమల్లో అభివృద్ధి పేరిట జరుగుతున్న విధ్వంసం సరికాదని వ్యాఖ్యానించింది. పశ్చిమ కనుమలతో పాటు ఉత్తరాదిలోని పర్వత ప్రాంతాల్లో, మన రాష్ట్రంలోని నల్లమల. శేషాచలం అటవీ ప్రాంతాల్లో సహజసిద్ధంగా ఏర్పడిన ప్రకృతిని కాపాడుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ**



# మువ్వన్నెల వికసిత భారత్

**మన సంపదను దోచుకున్న బ్రిటిషువారు ఎందరో మహనీయులు పుట్టిన పుణ్యభూమి భారతదేశం. మనదేశంపై అనేక దేశాలవారు దండయాత్రలు చేశారు. వందల సంవత్సరాలు భారతదేశాన్ని విదేశీయులు పాలించారు. కొందరు అన్నదమ్ములవలే కలసిపోయి మన ప్రజలకు మేలు జరిగేవిధంగా పాలించారు.**

కవర్ స్టోరీ

షేక్ అబ్దుల్ హాకీం జాని

మరికొందరు ఇక్కడ సంపదను తమ దేశానికి తరలించారు. అలా ఇక్కడి సంపదను దోచుకున్నవారిలో బ్రిటిషువారు ఒకరు. రవి అస్తమించని బ్రిటిషు సామ్రాజ్యం అని చెప్పుకునే వీరు ఈస్టిండియా కంపెనీని స్థాపించి వ్యాపారం పేరుతో మనదేశానికి వచ్చి, ఈ పుణ్యభూమిపై పాతుకుపోయి రాజ్యాధికారాన్ని చేజిక్కించుకున్నారు. దాదాపు 200 సంవత్సరాల పాటు మనదేశాన్ని బ్రిటిషువారు పాలించారు. అయితే మనదేశానికి మేలు చేసిన బ్రిటిషు వ్యక్తులు అతితక్కువ సంఖ్యలో ఉన్నారు. ధవళేశ్వరం ఆనకట్ట రూపకర్త సర్‌ఆర్థర్ కాటన్ వలన గోదావరి జిల్లాలు ధాన్యాగారంగా మారాయి. విలియం బెట్టిక్ సతీసహగమనాన్ని నిషేధిస్తూ చట్టం చేశాడు. రిప్పన్ స్థానిక స్వపరిపాలను ప్రవేశపెట్టాడు. మన సంపదను ఒకచోటు నుండి మరో చోటకు తరలించడానికి వారి స్వార్థం కోసం రోడ్డు, రైలు మార్గానికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో వచ్చిన కొన్ని వ్యాధులకు బ్రిటిషు శాసనాన్ని అనుసరించి జనాభాను లెక్కించడానికి పదేళ్లకాలం పట్టింది. భారతదేశంలో అక్షరాస్యులు ఎంతమంది ఉన్నారని తెలుసుకునేందుకు జనాభా లెక్కలను మొదలెట్టారు. బ్రిటిషు వారి నుండి మనవారు ఆంగ్లభాషను నేర్చుకున్నారు. అది ఇప్పటికీ మనకు ఉపయోగపడుతుంది. అంటరానితనం, మనుషుల్ని బలిఇవ్వడం వంటి మూఢనమ్మకాలను తొలగించేందుకు శాయశక్తులా కృషి చేశారు.

మేలు తక్కువ-కీడు ఎక్కువ

వేళ్లపై లెక్కించదగిన వారు ఇటువంటి కొన్ని మంచి పనులు చేశారు. బ్రిటిషు పాలనలో మనకు మేలు తక్కువగా జరిగి కీడు ఎక్కువగా జరిగింది. మంచి వ్యక్తులను మినహాయిస్తే బ్రిటిషు వారివల్ల మనదేశం ఆర్థికంగా చాలా నష్టపోయింది. ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ కరువైంది. వారి పాలనను వ్యతిరేకించి స్వాతంత్ర్యాన్ని కోరుకుంటూ మన ప్రజలు లక్షలాదిమంది ప్రాణత్యాగం చేశారు. ఒకవైపు స్వాతంత్ర్య పోరాటం జరుగుతూ ఉండగానే బ్రిటిషువారు మన సంపదను తమ దేశానికి తరలించారు. విభజించు-పాలించు అనే సూత్రం ఆధారంగానే వారు పరిపాలన చేశారు. హిందూ, ముస్లింల మధ్య కొట్లాటలు పెట్టేవారు. అన్నదమ్ముల్లా జీవిస్తున్న రాజుల స్నేహాన్ని విభజించి శత్రుత్వం పెంచేవారు. ఇలా మనలో మనమే తన్నుకుచచ్చేలా చేసి మన సంపదను వారి దేశమైన ఇంగ్లండుకు తరలించేవారు. అన్యాయం, కర్కశం, అత్యాశ, నరమేధం వంటిపాశవికమైన సూత్రాలపైనే నాటి తెల్లదొరల పాలన సాగింది. నేటికీ బ్రిటన్ రాజకుటుంబీకులు ధరిస్తున్న ఆభరణాలలో మనదేశానికి చెందినవి చాలా ఉన్నాయి. ప్రపంచంలో చాలాదేశాలను బ్రిటిషు వారు దోచుకున్నప్పటికీ మనదేశం ముందువరసలో ఉంటుంది. ఆఫ్రికాలో ప్రజల్ని బానిసలుగా చేసుకుని అమ్మేవారు, చైనాలో మత్తుమందు వ్యాపారం చేశారు. 1750 ప్రాంతంలో భారతదేశం చాలా ధనికదేశం. వస్త్రాలు, చక్కెర, సుగంధద్రవ్యాలు ఒకటేమిటి అనేక ఆహార వస్తువుల్ని,

ముడి సరకుల్ని మనదేశం నుండి ఇతర దేశాలకు ఎగుమతి అయ్యేవి. బ్రిటిషువారు మనకు పన్ను చెల్లించేవారు కాదు. మనచేతే పన్నులు కట్టించి భారతీయుల్ని బానిసలుగా చేసి ఉపయోగించుకునేవారు. డబ్బు ఆశ చూపి మన ప్రజల్లో కొందరిని లోబరచుకుని వారి తొత్తులుగా చేసుకుని గూఢచారులుగా ఉపయోగించుకున్నారు. ఈ విధంగా లంచం తీసుకోవడం అనేది వారి నుండి మనవారు నేర్చుకున్నారని



చెప్పవచ్చు. మన సంపదంతా ఇంగ్లండుకు తరలి వెళ్లేది. అలా జరగకుండా ఉంటే అనేకమంది విదేశయులు మనదేశంతో వర్తక, వాణిజ్యాలు చేసి మనం ఇంకా అభివృద్ధిపథంలో పరుగులు తీసేవారం. అటువంటి దేశ సంపదను దోచుకుని సర్వనాశనం చేశారు.

## రత్నగర్భ భారతదేశం

బ్రిటిషువారు రాకమునుపు మనదేశం సిరిసంపదలతో తుల తూగింది. భారతదేశాన్ని రత్నగర్భ అని పిలిచేవారు. వీధుల్లో కూరగాయలు అమ్మినట్లు వజ్రాలు, వైఢూర్యాలు అమ్మేవారు.



బ్రిటిషువారు 1747 నుండి 1947 వరకు మనదేశాన్ని 200 సంవత్సరాలు పరిపాలించి, మన సంపదను దోచుకుని వారి దేశానికి తరలించిన తరువాత మనదేశం దయనీయస్థితికి చేరుకుంది. ఇటువంటి నిజాలు నేటి యువతకు చాలామందికి తెలియదంటే అతిశయోక్తి కాదు. మన యువతలో ఎక్కువమంది సామాజిక మాధ్యమాలలో రీల్స్ చేస్తూ, రీల్స్ చూస్తూ రాత్రికి రాత్రి సెలబ్రెటీస్ అయ్యామనే భ్రమల్లో బతుకుతూ కాలాన్ని, జీవితాన్ని వృథా చేసుకుంటున్నారనే విషయం సర్వవిదితమే. మరి కొందరైతే అసత్యవార్తలను నిజమైన వార్తలుగా చరిత్రను వక్రీకరిస్తూ, ప్రజలను పక్కదారి పట్టిస్తూ, మా కులం గొప్ప, మా మతం గొప్ప, మా ధర్మాన్ని మించిందిలేదని ఊసుపోని కబుర్లతో సామాజిక మాధ్యమాలలో సమయాన్ని వృధా చేసుకుంటూ తమ జీవితాన్ని తామే బుగ్గిపాలు చేసుకుంటున్నారు. జాతీయ పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయినా వీరికి పట్టదు. ధరలు ఆకాశాన్ని అంటినా చీమ కుట్టినట్లు కూడా ఉండదు. మత హింసలతో దేశం అట్టుడిగిపోయినా మనకు సంబంధం లేని విషయంగా భావిస్తూ సామాజిక మాధ్యమాలలో హీరోయిజం చూపిస్తూ తామే సెలబ్రిటీలు అనే భ్రమల్లో బ్రతుకుతూ జీవితాన్ని బూడిదలో పోసిన పన్నీరులా చేసుకుంటున్నారు. యువత సృజనాత్మ, ఆలోచనా శక్తి పెంచుకుని మంచి, చెడు, సత్యం, అసత్యంల మధ్య తేడాను తెలుసుకుని మసలుకుంటే గోబెల్స్ ప్రచారం చేసేవారి ఆటలు అరికట్టి దేశాన్ని కాపాడుకోవచ్చు. త్యాగధనుల త్యాగాలతో పాటు వక్రీకరించిన చరిత్రకాకుండా నిజమైన చరిత్రను యువత తెలుసుకున్నప్పుడు దేశానికి మేలు జరుగుతుంది. ఆ విషయాలను పక్కనపెడితే బ్రిటిషువారు భారతదేశాన్ని పరిపాలించిన కాలంలో జలగలు రక్తాన్ని పీల్చినవిధంగా మనదేశం నుండి ఎంత సంపద దోచుకుని వెళ్లారు అనే విషయం ముఖ్యంగా నేటి యువతతోపాటు భారతీయులందరికీ తెలియవలసిన విషయం. బ్రిటిషువారు భారతదేశాన్ని ఆక్రమించిన కొత్తలోనే మన సంపదపై కన్నేశారు. భారతదేశంలో పలు ప్రాంతాలు అనేకమంది రాజులు, సంస్థానాల పాలనలో ఉండేవి. కొందరిని భయపెట్టి మన సంపదను కొల్లకొడితే, మరికొందరిని సామంతులుగా చేసుకుని కప్పం రూపంలో వసూలు చేసి మన సంపదను తమ దేశానికి తరలించారు. అప్పట్లో మొఘల్ చక్రవర్తి నూరుద్దీన్ మహమ్మద్ జహంగీర్ పుట్టినరోజు. ఈ సందర్భంగా మొఘల్ దర్బార్‌లో తులాభారం జరుగుతోంది. బంగారు తాపడం చేసిన తాసులో ఒక పళ్లెంలో మొఘల్ చక్రవర్తి కూర్చుని ఉంటే, మరో పళ్లెంలో వెండి, బంగారు నాణేలు, ఆభరణాలు, విలువైన వస్తువులు తూకం వేసి పేదలకు పంచిపెడుతున్నారు. ఇదంతా అక్కడే దర్బార్‌లో ఓ మూల నిల్చొని బ్రిటిష రాయబారి 'సర్ థామస్ రో' గమనిస్తూ ఉన్నాడు. ఆ తర్వాత వాణిజ్య ఒప్పందం కోసం అతను జహంగీర్ ముందు మోకరిల్లాడు. మూడేళ్లపాటు మొఘలుల చుట్టూ తిరుగుతూ కాళ్లావేళ్లా పడితే చివరకు జహంగీర్ సంరక్షకుడు అహద్ షాజహాన్‌ను ఒప్పించి సూరత్‌లో ఈస్టిండియా కంపెనీ ఏర్పాటుకు అనుమతి పొందారు. ఈ సంఘటనే మనదేశాన్ని దాదాపు రెండువందల సంవత్సరాలపాటు చీకటిలోకి నెట్టేసింది. చివరకు 1803లో ఈస్టిండియా కంపెనీ ఇచ్చే భృతిపై మొఘల్ చక్రవర్తి షా ఆలం ఆధారపడాల్సి వచ్చింది. దీని కోసం ఆ కంపెనీ క్లర్కు ముందు మోకరిల్లాల్సి దుస్థితి వచ్చింది. అంటే భారత్ నుంచి ఆంగ్లేయులు ఏవిధంగా ఎంత దోచుకుని ఉంటారనేది సునాయసంగా అర్థం చేసుకోవచ్చు.

## భారత్ చిరునామా కనిపెట్టిన వాస్కోడిగామా

వ్యాపారం పేరుతో మనదేశంలోకి బ్రిటిషు వారి కంటే ముందు అడుగిడింది ప్రోర్చుగీసు వారు. 1498లో వాస్కోడిగామా యూరప్ నుంచి భారత్‌కు సముద్రమార్గాన్ని కనిపెట్టాడు. ఆ తర్వాత వాణిజ్యం పేరు చెప్పి దేశంలోకి పోర్చుగీసు వారు ప్రవేశించి భారత వ్యాపారరంగంలో దూసుకునిపోతూ మన వ్యాపారులపై పట్టు, పైచేయి సాధించారు. అనంతరం పోర్చుగీసు తర్వాత డచ్‌వాళ్లు కూడా భారత్‌లోకి అడుగుపెట్టారు. ఈసారి వీళ్ల ఫిరంగులు, నౌకాదళంలో రావడంతో ఆ రెండుదేశాల మధ్య యుద్ధాలు మొదలయ్యాయి. ఇదంతా ఓపిగ్గా గమనించిన ఇంగ్లండ్ సమయం కోసం చేసి చూసింది. సమయం చిక్కగానే 1608లో భారత్‌లో ఈస్టిండియా కంపెనీని మొదటి క్వీన్ ఎలిజబెత్ కాలంలో అడుగు పెట్టడం జరిగింది. భారత్‌తో వాణిజ్యం కోసం బ్రిటిషు

రాయబారి సర్‌థామస్‌రో చాలానే కష్టపడ్డాడు. ఎందుకంటే మొఘల్ చక్రవర్తి దృష్టిలో ఇంగ్లండ్ పెద్దగా ప్రాధాన్యం లేని ఒక చిన్న దీవి. దానిని ఒక సామ్రాజ్యంతో పోల్చడం మొఘలుల పరువు ప్రతిష్ఠలకే భంగం. అయితే సర్ థామస్ రో ధైర్యం కోల్పోలేదు. మూడేళ్ల నిర్విరామంగా కష్టపడ్డాడు. దౌత్య ముడుపులు, బహుమతులు ఇచ్చి, చక్రవర్తి జహంగీర్ అనుచరుడు అహద్ షాజహాన్ మెప్పించి, సూరత్ నగరంలో వ్యాపారం చేసుకోవడానికి అనుమతి పొందాడు. ఆ కారణంగా మనదేశంలో ఈస్టిండియా కంపెనీ ఏర్పాటైంది.

## తీరప్రాంతాలలో వ్యాపార స్థావరాలు

ఆరోజుల్లో ఎగుమతులు, దిగుమతులు సముద్రతీర ప్రాంతాలలో నౌకలు, ఓడల ద్వారా జరిగేవి. మనదేశ సంపదను బ్రిటిషువారు తమ దేశానికి తరలించడానికి తీరప్రాంతాలు అనువైనవని గమనించారు. మొఘలుల నుంచి ఆదేశాలు రాగానే ఆంగ్లేయులు భారత్‌లోని సముద్రతీరం వెంబడి ఉన్న నగరాల్లో ఒక్కొక్కటిగా తమ వ్యాపార స్థావరాలను స్థాపించడం మొదలుపెట్టారు.



వీటిల్లో మసాలా దినుసులు, పట్టు, పత్తి, ఇతర వస్తువుల వ్యాపారం ప్రారంభించారు. ఈ వ్యాపారాలలో అద్భుతమైన లాభాలు పొందారు. వ్యాపార పోటీ నేపథ్యంలో ఇతర యూరప్ దేశాలకు ఇంగ్లండ్‌కు మధ్య తరచూ యుద్ధాలు జరుగుతుండేవి. దీంతో సరుకులను దోచుకోవడానికి తీర ప్రాంతాలలో ఉన్న వ్యాపార కేంద్రాలను కోటలుగా మార్చేశారు. భారీగా సిపాయిలను నియమించుకుని తమ బలాన్ని పెంచుకున్నారు.

## మొఘలుల దుస్థితి

వందలాది సంవత్సరాలు మతసామరస్యంతో అనేకమంది మొఘలు చక్రవర్తులు రాజ్యమేలారు. అన్నిమతాల వారిని తమ సైన్యంలో చేర్చుకున్నారు. ఇక్కడి మహిళలనే వివాహం చేసుకున్న వారు కూడా ఉన్నారు. చివరకు ఈ మట్టిలోనే కలిసిపోయారు. అందుకు సాక్ష్యం హుమయూన్ సమాధి ఢిల్లీలోను, అక్బర్ సమాధి ఆగ్రా సమీపంలోని సికంద్రాలోను, ఔరంగజేబు సమాధి ఔరంగాబాద్‌లోను మనకు ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయి. ఇంత వైభవంగా రాజ్యమేలిన మొఘల్ చక్రవర్తుల పరిస్థితి చివరకు దారుణంగా మారిపోయింది. 1803లో ఢిల్లీ సింహాసనంపై ఉన్న మొఘల్ చక్రవర్తి షా ఆలం ఈస్టిండియా కంపెనీ ఇచ్చే భృతిపై ఆధారపడాల్సిన పరిస్థితికి వచ్చింది.

ఒకప్పుడు బ్రిటిషు రాయబారి సర్ థామస్ రో మొఘల్ చక్రవర్తి ముందు వంగి ఒప్పందం చేసుకున్నాడు. ఆ తరువాత అదే మొఘల్ పాలకులు ఈస్టిండియా కంపెనీలోని ఒక క్లర్క్ ముందు మోకరిల్లి బెంగాల్‌ను అప్పగించాల్సిన దుస్థితికి చేరారు. బెంగాల్ ఆక్రమణ తర్వాత ఒక్కో సంస్థానాన్ని సొంతం చేసుకుంటూ ఈస్టిండియా కంపెనీ ముందుకు సాగుతూ తమ సామ్రాజ్యాన్ని స్థాపించింది.

## సిపాయిల తిరుగుబాటు

1857లో సిపాయిల తిరుగుబాటుతో ఈస్టిండియా కంపెనీ పతనం ప్రారంభమైంది. సిపాయిల తిరుగుబాటుతో యుద్ధంలో భారీగా రక్తపాతం చోటుచేసుకుంది. దేశమంతటా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే అప్పుడు ఉన్న వార్త పత్రికల ద్వారా భారత్‌లో జరుగుతున్న పరిస్థితుల గురించి ఇంగ్లండ్‌కు తెలిసిపోతూ ఉండేది. దీంతో భారత్‌లోని ప్రజల నుంచి వ్యతిరేకతను తగ్గించేందుకు ఇంగ్లండ్ పార్లమెంట్‌లో పలు నిర్ణయాలు తీసుకున్నారు. వాటి కారణంగా భారతదేశాన్ని నేరుగా బ్రిటిషు ప్రభుత్వం కిందకు తీసుకొచ్చింది. ఆ తర్వాత ఈస్టిండియా కంపెనీ కొన్ని సంవత్సరాలు మాత్రమే అక్కడక్కడ పనిచేసింది. వందలాది సంవత్సరాల సుదీర్ఘ పాలన తర్వాత చివరకు 1 జూన్ 1874న ఈస్టిండియా కంపెనీ రద్దయింది. బ్రిటిషు క్రూరమైన వలస పాలనలో 1880 నుండి 1920 మధ్య భారతదేశంలో 165 మిలియన్ల అదనపు మరణాలు సంభవించాయి. రాణి వేలు నాచియార్ భారతదేశంలో బ్రిటిషు వలసరాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన మొదటి రాణి. ఆమెను తమిళులు వీరమంగై అని పిలుస్తారు. ఇలా ఎంతోమంది పోరాటాలు, ప్రాణత్యాగాల తర్వాత 15 ఆగస్టు 1947 అర్ధరాత్రి బ్రిటిష్ ప్రభుత్వం మన దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించి వెళ్లిపోయింది. బ్రిటిషువారు మన దేశ సంపదను రాత్రికి రాత్రి దోచుకుని వెళ్లలేదు. 200 సంవత్సరాల పాలనా కాలంగా దశల వారీగా అవకాశం లభించిన చోట దొరికింది దొరికినట్లు దోచుకుని ఓడల్లో తమ దేశానికి తరలించారు. 1947లో మనకు స్వాతంత్ర్యం ప్రకటించి బ్రిటిషు ముష్కరులు భారత్ నుంచి తమ దేశానికి వెళ్లిపోయేటప్పుడు మన దేశానికి చెందిన లెక్కలేనంత సంపదను నౌకలలో తరలించుకుని వెళ్లారు.

## బ్రిటిషు మ్యూజియంలో మన సంపద

బ్రిటన్‌కు చెందిన ది గార్డియన్ పత్రిక బ్రిటిషువారు భారతదేశంతో పాటు ప్రపంచ దేశాల నుండి ఎంత సంపదను దోచుకుని వచ్చారని ఆధారాలతో సహా గతంలో అద్భుతమైన వ్యాసాన్ని నివేదిక రూపంలో ప్రచురించింది.

ఆ వ్యాసం ప్రపంచ వ్యాప్తంగా సంచలనాన్ని కలిగించడమే కాక బ్రిటన్ రాజ కుటుంబీకులకు ముచ్చెమటలు పట్టించింది. ఆ తరువాత బి.బి.సి.తో పాటు ప్రపంచంలో అనేక దేశాల పత్రికలు ఇదే విషయమై సంచలన వ్యాసాలు రాయడంతో ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర స్థాయిలో చర్చలు జరిగాయి. వ్యాపారం పేరుతో ప్రపంచంలోని అనేక దేశాలలో పాగా వేసిన బ్రిటిషువారు ఆ తరువాత వలస పాలకులుగా మారారు.

అలా వారు ప్రపంచంలోని అన్ని దేశాలను దోచేసి ఆ సంపదను తమ దేశానికి తలించారు. అయితే హెచ్చు సంపదను భారతదేశం నుండే దోచుకుని వెళ్లారు. దోచుకోవడం దాచుకోవడమే లక్ష్యంగా బ్రిటిషు వలస పాలన సాగింది. ఇది చరిత్ర కాదనలేని సత్యం. రెండు శతాబ్దాల పాటు భారత్‌ను తెల్లదొరలు దోచుకున్నారు. ఇండియా నుంచి బ్రిటిషువారు ఆ కాలంలో తమ దేశానికి తలించిన సంపదను ప్రస్తుత విలువలో లెక్కకడితే దాదాపుగా 45 ట్రిలియన్ డాలర్లకు సమానమని నిపుణులు చెబుతున్నారు.



కలప కోసం బ్రిటిషువారు మన అడవుల్ని నాశనం చేసారు. ఎర్ర చందనం, గంధపు చెక్కను కూడా తమ దేశాలకు తరలించారు. వాణిజ్యం కోసం అస్సోం, ఊటీ, కేరళ వంటి అనేక ప్రాంతాలలో తేయాకును పండించి తమ దేశానికి ఎగుమతి చేసుకున్నారు. కేరళలో అయితే బ్రిటిషువారు నిర్మించిన టీ ఫ్యాక్టరీలు ఇప్పటికీ ఉన్నాయి. కేరళ నుండి ముడి రబ్బర్‌ను తమ దేశానికి తరలించారు. ఇలా ప్రతీ వాణిజ్యం పంటను దోచుకుని వెళ్లారు. పత్రికా స్వేచ్ఛను హరించారు. బ్రిటిషువారు వార్తపత్రికలకు, ప్రింటింగ్ ప్రెస్‌లకు లైసెన్సులను జారీ చేసేవారు. వారికి ఇష్టమైన వారికే అనుమతిస్తూ అన్ని తమ నియంత్రణలో ఉండేలా చేసేవారు. వార్తలను సెన్సార్ చేసేవారు. బ్రిటిషువారికి వ్యతిరేకంగా వార్తలు రాస్తే దేశద్రోహం కేసులు నమోదు చేసేవారు. ఇలా బ్రిటిషువారు మన దేశంలో చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు.

కానీ మనం బ్రిటన్ రాణి కిరీటంలో ఉన్న కోహినూర్ వజ్రం గురించే ఎక్కువగా మాట్లాడుకుంటాం. నిజానికి భారతీయ సంస్కృతి, చరిత్రను తెలియజేసే ఎన్నో వెలకట్టలేని కళాఖండాలను మన దేశం నుంచి ఎత్తుకెళ్లారు తెల్లదొరలు. ఇప్పటికీ బ్రిటన్‌లోని పలు మ్యూజియాల్లో చెక్కుచెదరకుండా అవి ఉన్నాయి. కోహినూర్‌తో పాటు వీటిని కూడా తిరిగి ఇవ్వాలన్న డిమాండ్లు వెల్లువెత్తున్నాయి. మన దేశం నుండి బ్రిటిషువారు దోపిడి చేసి తమ దేశానికి తలించిన వాటిలో లెక్కలేనన్ని బంగారు నగలు ఉన్నాయి. ఇంగ్లండ్ రాణి ప్రతిరోజూ ఒక ధరించినా కొన్ని సంవత్సరాల పాటు ధరించగలిగిన విలువైన ఆభరణాలు వేల సంఖ్యలో ఉన్నాయని అంచనా. బ్రిటిష వలస పాలకులు అత్యధిక సంపద దోచుకున్న దేశాల జాబితాలో భారత్ ముందు వరసలో నిలుస్తుంది. ఆ సంపద ఇప్పుడు మన చేతిలో ఉంటే మన దేశ పరిస్థితి మరోలా ఉండేది. పాలన పేరుతో దశాబ్దాల పాటు భారత్‌ను దోచుకున్నారు. బంగారం, వజ్ర వైఢూర్యాలు మొదలుకొని విలువైన సంపదను తమ దేశానికి తరలించుకుపోయారు. బ్రిటిషువారు మన దేశాన్ని వదిలిపోయేనాటికి ఇక్కడ ఇంకేమీ మిగల్లేదనేని నగ్నసత్యం. ఇప్పుడు ఆ సంపదంతా బ్రిటిష రాజ ప్రాసాదాలతో పాటు బ్రిష మ్యూజియంలో మూలుగుతుంది. ఔరంగజేబు పాలనా కాలంలో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశం. అటువంటి రత్నగర్భను దోచుకుని మన ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు.



**అప్పట్లో బ్రిటిష్‌వారు మన దేశం దోచుకెళ్లిన సంపదల్లో ముఖ్యమైనవి..**

కోహినూరు వజ్రం ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని కొల్లూరు గ్రామంలో దొరికిందని కొందరు తెలియక ప్రచారం చేస్తుంటారు. ఇది అసత్యం. కోహినూర్ వజ్రం ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత పల్నాడు జిల్లా సత్తెనపల్లి సమీపంలో బెల్లంకొండ సమీపంలోని కోళ్లూరు గ్రామంలో కృష్ణానది ఒడ్డున దొరికింది. కృష్ణా పరీవాహక ప్రాంతంలో ఉన్న కోళ్లూరులో వజ్రాల గనులున్నాయి. ఈ ప్రదేశంలో వజ్రాలు పుట్టడమే కాకుండా కొట్టుకుని వచ్చాయి. ఆ కాలంలో కాకతీయులు, కుతుబ్‌షాహీల కాలంలో ఈ వజ్రాలు ఆయా రాజ్యాలకు అదనపు ఆదాయాన్ని సమకూర్చాయి. 13వ శతాబ్దానికే కోళ్లూరు వజ్రాల గనులు చాలా ప్రాచుర్యం పొందాయి. 17వ శతాబ్దం వరకు ఈ గనులలో వజ్రాలు తవ్వారు కోహినూరు వజ్రం క్రీ.పూ.3 వేల సంవత్సరాల కాలం నాటిదని పరిశీలకులు నిర్ణయించారు. కొందరైతే కోహినూరు వజ్రమే శమంతకమణి అని అసత్య ప్రచారాలు చేస్తుంటారు. శమంతకమణి అయితే దాన్ని సానబట్టి మెరుగులు దిద్దవలసిన అవసరం లేదు. ఈ వజ్రం బ్రిటిషువారి చేతికి వెళ్లిన తరువాత సానబట్టి మెరుగులు దిద్ది, రాణి కిరీటంలో అమర్చారు. కోహినూరు వజ్రం ఎవరి నుండి ఎవరికి సంక్రమించిందనే విషయం ప్రస్తావిస్తే అది పెద్ద చరిత్ర అనే చెప్పాలి. అందువల్ల రేఖా మాత్రంగా తెలుసుకుందాం.

మొఘల్ పాలకుడు బాబర్ రాసిన బాబర్‌నామా ప్రకారం ఇది ఢిల్లీ సుల్తానులలో చివరివాడైన ఇబ్రహీంలోడీని 1526లో మొదటి పానిపట్ యుద్ధంలో ఓడించిన తరువాత కోహినూరు మొఘల్ చక్రవర్తి బాబర్ చేతికి వచ్చింది. కోహినూరు వజ్ర ఖరీదు ఎంత అనేది బాబర్ చక్రవర్తి మాటల్లో చెప్పాలంటే 'ప్రపంచానికంతా రెండున్నర రోజులు భోజనం పెట్టినంత' అని పేర్కొన్నాడు. బాబర్ నుండి అతని వారసులైన హుమయున్ చక్రవర్తి, షాజహాన్ చక్రవర్తి, ఔరంగజేబ్ చక్రవర్తి, అతని మనుమడు సుల్తాన్ మహమ్మద్ స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత క్రీ.శ.1739లో పర్షియన్ జనరల్ అయిన నాదిర్ షా చేతిలో మహమ్మద్ ఓడిపోవడంతో కోహినూర్ నాదిర్ షా వశమైంది. నాదిర్ షా మరణం కోహినూరు అహ్మద్ షా దుర్రానీ అధీనంలోకి వచ్చింది. అహ్మద్ షా వంశస్థుడైన షా షుజా దురానీ కాబూల్‌లో గొడవలు జరగడంతో సోదరుల నుండి తప్పించుకుని 1813లో పంజాబ్‌కు చేరతాడు. ఇతని ద్వారా పంజాబ్‌లో సిక్కు సామ్రాజ్య స్థాపకుడైన రంజిత్‌సింగ్ చేతికి కోహినూర్ వజ్రం అందుతుంది. రంజిత్‌సింగ్ మరణించిన తరువాత అతని ముగ్గురు కుమారుల్లో ఒకడైన దులీప్ సింగ్ 1843లో సింహాసనాన్ని

అధిష్టించి పాలన చేశాడు. ఆ సమయంలో కోహినూర్ అతనికి దక్కింది. అనంతరం 1849లో జరిగిన రెండవ ఆంగ్లో-సిక్కు యుద్ధంలో బ్రిటిషువారు విజయం సాధించారు. లాహోర్ ఒప్పందం ప్రకారం పంజాబ్ సిక్కు రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో జరిగిన ఒప్పందంలో కోహినూరు అనే వజ్రాన్ని లాహోర్ మహారాజు ఇంగ్లండ్ రాణికి అప్పగించాలని నిర్ణయించారు. క్రీ.శ.1852లో కోహినూరు వజ్రాన్ని విక్టోరియా మహారాణికి బహూకరించినట్లు తెలుస్తుంది. చివరకు అది బ్రిటన్ రాజవంశీయుల కిరీటంలోకి చేరింది.

## నెమలి సింహాసనం

బ్రిటిషువారు మన దేశం నుండి దోచుకుని వెళ్లిన అతి విలువైన వస్తువులలో నెమలి సింహాసనం ఒకటి. అద్భుతమైన సింహాసనం ఈ రోజుల్లో ప్రపంచానికి హిందీలో మయూర్ సింఘాసన్, ఉర్దూలో తఖ్త్-ఏ-తావూస్ అని పిలిచేవారు. తఖ్త్ అంటే సంహాసనం. తావూస్ అనగా నెమలి అని అర్థం.



అయితే మొఘల్ కాలంనాటి చరిత్రకారుడు ఇనాయత్ ఖాన్ తన 'షాజహన్నామా'లో రాసిన దాని ప్రకారం నెమలి సింహాసనం కోటి మొఘల్ రూపాయిల విలువ ఉంటుంది. 14 లక్షలు వజ్రాలు, 86 లక్షలు ఇతర రత్నాలను దీని తయారీ కోసం ఉపయోగించమని సుల్తాన్ ఆదేశించినట్లు పేర్కొన్నాడు. మొత్తం మీద రెండు తాజ్‌మహాళ్లు నిర్మించినంత ధనాన్ని నెమలి సంహాసనాన్ని నిర్మించడానికి ఖర్చు చేశారని తెలుస్తుంది. ఢిల్లీ ఎర్రకోటలోని దివాన్-ఎ-ఖాస్‌లో దీన్ని ఉంచారు. సింహాసనం 1150 కిలోల బంగారం, 230 కిలోల విలువైన రత్నాలు, పచ్చలు ఇందులో పొదిగారు. 1739లో పర్షియా రాజు నాదిర్షా మన దేశంపై దండెత్తి నెమలి సింహాసనాన్ని ఇరాన్‌కు తీసుకుని వెళ్లాడు. నాదిర్షా ద్వారా ఇది మహమ్మద్ రెజా షాహ్ పహ్లనీ వద్దకు చేరింది. 1747లో నాదిర్షా చనిపోయిన తరువాత నెమలి సింహాసనం తిరిగి భారత్‌కు చేరింది. 1857 సిపాయిల తిరుగుబాటు వరకు నెమలి సింహాసనం మన దేశంలోనే ఉన్నట్లు తెలుస్తోంది. కొందరి వాదన ప్రకారం కోహినూరు పొదిగిన అసలైన నెమలి సింహాసనాన్ని బ్రిటిషువారు ఏనాడో తమ దేశానికి తరలించారని తెలుస్తోంది.

ప్రస్తుతం 120కి పైగా అరుదైన శిలలపై చెక్కిన చలువరాతి శిల్పాలు, శాసనాలు బ్రిటన్ మ్యూజియంలో ఉన్నాయి. 33ఏ గది నిండా ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి నుండి దొంగిలించిన అపురూప శిల్పాలతో నింపేశారు. ఇక్కడ వందలాది సంవత్సరాల నాటి అరుదైన బౌద్ధ శిల్పాలు చూడవచ్చు. అమరావతిలో 1800లో జరిగిన తవ్వకాలలో అనేక బౌద్ధ శిల్పాలు బయట పడ్డాయి. వాటిని అప్పటి బ్రిటిషు అధికారులు లండన్ మ్యూజియంకు తరలించారు. అమరావతి మార్బల్స్‌ని ప్రస్తుతం లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో తిలకించవచ్చు. సుమారు 70 ప్రఖ్యాతి గాంచిన అమరావతి మార్బల్స్‌ని మనం మ్యూజియంలో చూడవచ్చు. రమారమి 140 సంవత్సరాల క్రితం ఈ మార్బల్స్ మద్రాస్ నుండి బ్రిటన్‌కి చేరవేశారు. గత 30 ఏళ్లగా వీటిని మ్యూజియంలో పర్యాటకులు చూస్తున్నారు. ఇంకా తంజావూరు పెయింటింగ్స్, అరుదైన శిల్పాలు ఇక్కడ చూడవచ్చు.

బ్రిటిషువారు దోచుకుని వెళ్లిన వాటిలో 17వ శతాబ్దంలో మైసూరును పాలించిన చక్రవర్తి టిప్పుసుల్తాన్ 1799లో యుద్ధభూమిలో మరణించగా ఆయన శవం నుంచి ఉంగరం, ఖడ్గం, అత్తరు, చెక్కతో చేసిన పులిబొమ్మ.. ఇత్యా వస్తువులను దోచుకుని వెళ్లి బ్రిటన్‌లోని వేర్వేరు మ్యూజియంలలో పెట్టారు. టిప్పుసుల్తాన్ ఉంగరాన్ని మాత్రం 1,45,000 పౌండ్లకు వేలం పెట్టింది. దాన్ని మన దేశానికి చెందిన విజయ్‌మల్యా దక్కించుకున్నారు.

మొఘల్ చక్రవర్తి షాజహాన్‌కి చెందిన విలువైన వైన్ కప్‌ని కల్నల్ చార్లెస్ సేటోన్ గుత్రియే 19వ శతాబ్దంలో దొంగిలించి బ్రిటన్‌కి చేరవేసాడు. 1962వ సంవత్సరంలో లండన్‌లోని విక్టోరియా అండ్ ఆల్బర్ట్ మ్యూజియంలో వైన్ కప్‌ని ఉంచారు. అది ఇప్పటికీ అక్కడనే ఉంది. ఈ పాత్ర మెడ వంచి మెలిక తిరిగిన పక్షి ఆకారంలో కనిపస్తుంది. ఈ పాత్రలో షాజహాన్ చక్రవర్తి మద్యం సేవించేవారు. దీన్ని క్రీ.శ.1657లో తయారు చేసినట్లు చరిత్ర చెబుతోంది. 9వ శతాబ్దానికి చెందిన అంబికా విగ్రహం మధ్యప్రదేశ్‌లోని ధర్ ప్రాంతంలో జరిగిన తవ్వకాలలో బయల్పడింది. అది 1886 తరువాత బ్రిటిష్ మ్యూజియంలో కనిపిస్తుంది. బీహార్‌లోని బగల్‌పూర్ జిల్లా సుల్తాన్‌గంజ్ ప్రాంతంలో 1962లో రైల్వే నిర్మాణ సమయంలో బయటపడ్డ బుద్ధ విగ్రహాన్ని ప్రస్తుతం బర్మింగ్‌హామ్ మ్యూజియంలో చూడవచ్చు. 2.3 మీటర్ల ఎత్తుండే ఈ విగ్రహాన్ని 500 కిలోల రాగితో తయారు చేశారు. ఇది రమారమి 1500 ఏళ్ల నాటిదని తెలుస్తుంది. మధ్యప్రదేశ్‌లోని ఖజురహో దేవాలయంలో ఉండే హరిహర విగ్రహం అప్పట్లో ఎన్నో చేతులు మారి చివరికి లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంకి చేరింది. వాటిని తిరిగి భారత్‌కు తీసుకురావడం కోసం ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, యునెస్కో ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. ఇప్పుడు వాటితో పాటు కోహినూర్‌ని ఇండియాకు తీసుకురావాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి.



అయితే ఇంగ్లండు ప్రభుత్వం ఏ డిమాండ్‌లను లెక్కచేయడం లేదు. అంతా ఇంగ్లండ్‌కు చెందిన సంపదే అని వితండ వాదం చేస్తున్నారు. తిరిగి మన దేశానికి పంపడానికి వారు సుముఖంగా లేనట్లు తేల్చి చెప్పింది. ❏



# చనిపోయినవారు తిరిగొస్తే..

**అంతుపట్టని వ్యాధితో పదేళ్ల చిన్నారి కానరాని లోకాలకు వెళ్లిపోయింది. బాధను భరించలేని తల్లి ఆ క్షణం నుంచీ ప్రపంచానికి దూరంగా కూతురి జ్ఞాపకాలతో జీవచ్ఛవంలా బతుకుతోంది. అలా చూస్తుండగానే నాలుగేళ్లు గడిచిపోయాయి. కానీ ఓ రోజు తన ముద్దల కూతురు 'అమ్మా! నేను నిన్ను చాలా మిస్ అవుతున్నా' అంటూ దగ్గరకొచ్చి తల్లి ఒడిలో ఒదిగిపోయింది. ఆ స్పర్శతో ఆ తల్లికి ప్రాణం లేచొచ్చింది. వెలకట్టలేనంత ఆనందంతో మనసు ఉప్పొంగిపోయింది.**

ప్రతి గుండెనూ కదిలించి, కంటతడి పెట్టించిన ఈ దృశ్యం దక్షిణ కొరియా టీవీ షోలో కనిపించింది. ఇంతకీ ఇదెలా సాధ్యమైందీ అంటే అందుకు కారణం వర్చువల్ రియాలిటీ (వీఆర్) టెక్నాలజీ. 'మీటింగ్ యూ' పేరుతో చూపించిన ఈ టెలివిజన్ షో వీఆర్ మాయతో చనిపోయిన వారిని మళ్లీ కళ్లముందుకు తీసుకొచ్చేందుకు చేసిన ఒక ప్రయత్నం. వీఆర్ సాంకేతికతనూ, స్పర్శ కోసం ప్రత్యేమైన గ్లౌజునూ ఉపయోగించి చనిపోయిన పాపను కళ్లముందుకు తీసుకొచ్చారు. లేదా దాన్ని ఉన్నట్టుగా చూపించే వర్చువల్ రియాలిటీ టెక్నాలజీ దూరమైపోయిన వాళ్లనూ ఇలా దగ్గరకు తీసుకొస్తే మనుషుల మనసులు ఎంత తేలికైపోతాయి. 'పోగొట్టుకున్న ఆత్మీయుల్ని పూర్తిగా మళ్లీ మన జీవితాల్లోకి తీసుకురావడం కుదరకపోయినా కనీసం ఆ కదిలే రూపం కళ్లముందు కనిపిస్తే మరెంత సంతృప్తి కల్గుతుంది' ఆ ఆలోచనతోనే కొరియాలో తయారు చేసిన 'మీటింగ్ యూ' స్ఫూర్తితో సరదా ఆటల్లోనే కనిపించే వీఆర్‌తో మనసుకు హత్తుకునే మధురజ్ఞాపకాల్నీ తీసుకొస్తున్నారు. విదేశాల్లోనే కాదు, ఇప్పుడు మన దేశంలోనూ ఈ వీఆర్ మెటావర్‌సతో దూరమైన కుటుంబ సభ్యుల్ని మళ్లీ కలవడం సాధ్యం చేస్తున్నారు. తమిళనాడుకు చెందిన 'హ్యాపీ టియర్స్' సంస్థ ఆ వెసులుబాటును అందిస్తోంది. రూపురేఖల కోసం ఫొటోలూ, పూర్తి వివరాలూ తీసుకుని నిజమైన రూపాన్ని తీసుకురావడమే కాదు, వీఆర్ కళ్లజోడును పెట్టుకోగానే వాళ్లు నిజంగానే మన ముందుకు నడిచొచ్చినట్టూ, మనల్ని ప్రేమగా కౌగిలించుకున్నట్టూ రకరకాల దృశ్యాలను తీర్చిదిద్దుతారు. వాళ్లతోపాటూ అందులో మనల్నీ చొప్పించేసీ..మనం వాళ్లతో సరదాగా గడుపుతున్నట్టు కూడా చూపిస్తారు.



మొన్నీమధ్య తమిళ హీరో విజయన్ తల్లి ఆ సంస్థ ద్వారా విజయన్‌ను ఆశ్చర్యపరిచింది. చిన్నప్పుడే దూరమైన ఆమె కూతురు విద్యను ఈ వీఆర్‌లో చూపించి భావోద్వేగానికి గురి చేసింది. చిన్నప్పటి జ్ఞాపకాల్లోకి వెళ్లి తానూ కన్నీళ్లు పెట్టుకుంది. సెలెబ్రెటీలు చేసుకుంటున్నారని ఎక్కువ ధర ఉంటుందనుకోకండి. 2500 రూపాయలతో ఎవరైనా చేయించుకోవచ్చు. ఆప్ సాయంతో పనిచేసే ఈ టెక్నాలజీని వీఆర్ బాక్స్ ద్వారా చూడొచ్చు. బర్త్‌డే, పెళ్లిరోజు ఇలా ప్రత్యేక సందర్భాల్లో ఏదో ఒక బహుమతి ఇచ్చి ప్రియమైనవారి ముఖాల్లో చిరునవ్వులు తెప్పించడం కన్నా హఠాత్తుగా తమను విడిచి వెళ్లిపోయిన ఆత్మీయుల్ని ఇలా కళ్లముందుకు తీసుకొచ్చి కళ్లలో ఆనందభాష్పాల్ని రప్పిస్తే కచ్చితంగా ఆ కానుక, ఎంతో అపురూపమవుతుంది.

# ఈవారం కవిత్వం

# అంతే!



కళ్లలోంచి
ఎప్పుడూ మన అశ్రువులే రాలవు
ఇతరుల దుఃఖం కూడా వర్షిస్తుంది.

మర్చిపోవద్దు
సూర్యుడు కూడా
భూమి దుఃఖాన్ని పంచుకోవడానికే
ఉదయిస్తున్నాడు.

చెట్లు గాలి
వీస్తున్నాయనుకుంటాం
అవి నిట్టూర్పులని
గమనించం.
శిశిరాన్ని చూసి భయపడతాం
రాబోయే పువ్వుల్ని కాస్సేపు తలుచుకుందాం
అద్దంలో నీ విషణ్ణ వదనాన్ని చూసుకొని బాధపడకు
నీ ఆప్తుల స్ఫాటిక నేత్రాల్లో
నువ్వు భద్రంగానే వుంటావు.

వాక్యాలకూ వేర్లుంటాయి
అర్థం
పదాల నీడ కాదు
వాటి వెలుగు!

జీవితం
ఒక ప్రణాళికాబద్ధం కాదు
ప్రవహించే నది
గమ్యాన్ని గురించి ఎవర్నీ అడగదు.
కవిత్వమూ అంతే!
అలా అలా వెలువడుతుంది
అంతే!

– డా॥ ఎన్.గోపి

# లాంతరు నది



పదిలించుకోవాలి కొన్నింటిని
నీటి బిందువుల ప్రతిబింబాలని
ఏ ముక్కో ఆకసానిది
రాలిపడింది నా ముంగిట్లో
వాకిలి తలుపులేసేప్పుడు
కొంచెం కంప కొట్టిపోయింది గాలి
చెల్లాచెదురుగా..

వర్షం కిటికీ వరకే కురిసింది
ఆవల ఆమె ముఖం బయటికి చూస్తోంది
కాగితం పడవల జ్ఞాపకాలలో
బాల్యాన్ని కొంగున కట్టుకొని
జడ వేసుకుంటుంది
వాననీళ్ల కాలువగా.. పాయలుగా
లయ తప్పిన శరీరాలేమో
గొణుక్కుంటూ పోతున్నాయి
కనికరం లేకుండా ఆ మాటలు..!

గుడ్డిదీపాలు మూలుగుతున్నాయి
లాంతరు దూరం వరకూ కనిపిస్తది
కానీ వెలుతురు ఇవ్వదు ఆవరణలో
పిట్టల రెక్కలు మెత్తనివి
కడప ముంగట పడున్నవి
పొద్దెక్కేవరకు కనిపిస్తయి.

రాత్రిలో.. ఆ ఇంట్లో గిన్నెలు ఉడికి
కొంత వెలుగు బువ్వను ప్రసాదిస్తవి
నీళ్లకుండలో నది పారుతది
నట్టింట్లో కోయిలలు తిరుగాడుతూ
వసంతాన్ని కురిపిస్తాయి
అక్కడున్న అందరూ
ఆర్ద్రతతో చూస్తుంటారు
అలాగే బయటకు
హృదయ గవాక్షాలు తెరిచి...

– రఘు వగ్గు

## దర్శన

ప్రొద్దుట చూస్తే ఆకాశంలో
చిన్నచిన్న మేఘాలు చేపపొలుసులా
సాయంత్రం మశూచి పోసినవాని
ముఖంలా అదే ఆకాశం
...
యామిని కూతురు ముద్దుబాల
మొలకు అలవోకగా వేలాడుతున్న
అందాల వెండి సిగ్గు బిళ్ల
ఆకాశంలో చంద్రుడు.

– భూషి కృష్ణదాసు

# పుస్తక సమీక్ష



## 'బాలల' నాన్నారం కథలు

చందమామ పత్రికలకు అంకితంగా 30రోజులూ హాయిగా ఆనందంగా చదువుకొనే విధంగా 30 కథలలో సచిత్రాలతో ఈ బాలల కథా సంపుటి తెచ్చారు రచయిత. అన్ని కథలూ పేజీ-పేజీన్నరలో సచిత్రాలతో ఆకట్టుకొంటాయి. గతంలో వీరు రాజుగారి కథలు-రాణిగారి కథలు, కార్వేటినగరం కథలు లాంటివి రాసారు. అవి పాఠకాదరణ పొందాయి. ముఖ్యంగా పిల్లల్ని అలరించాయి. కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత కన్నెగంటి అనసూయ అట్టవెనుక చక్కటి అభిప్రాయం రాసారు. 'బంగారు కోడిపెట్ట' కథలో ఉదయగిరి రాజావారి పోటీల్లో రాజమందిరం మేడ నుండి కోడిగుడ్డు విసరాలని అది క్రిందపడినా పగలకూడదు. ఈ పోటీలో యువకులు చాలామంది గడ్డిపరిచి విసరడం, కొందరు దూది పరచి విసరడం, కొందరు పరుపులు పరిచి విసరడం, గుడ్డుపగలడం, చివర్లో సరస్వతక్క తన కోడి తెచ్చి మేడపై నుండి విసరడం అది కిందపడ్డ తర్వాత గుడ్డు పెట్టడం రాజు ఆమెకు రెట్టింపు బహుమతిని ఇవ్వడం కథాంశం.. కోడిని పెంచితే కోడి గుడ్డంత బంగారం వస్తుందనేది పెద్దల నానుడి (పేజీ-101). నేటికాలంలో ప్రభుత్వాలు ఇస్తున్న సబ్సిడీలు ఉచిత పథకాలు లబ్ధిపొందే వారికి ఈ కథ కొంతలో కొంతైనా మార్పు తెప్పిస్తుంది (పేజీ.64). రచయిత కృషి అభినందనీయం. **(నాన్నారం కథలు, రచన: ఆర్.సి.కృష్ణస్వామి రాజు, వెల: రూ 140, ప్రతులకు: 22-4-71, బ్యాంకు ఎంప్లాయిస్ కాలనీ, మంగళం రోడ్డు, తిరుపతి)**

**- తంగిరాల చక్రవర్తి**

## పిల్లల అల్లరి కథనాలు



'ఏనుగును పెంచుకుందాం' పిల్లల అల్లరి కథనాలు, డా॥కందేపి రాణీప్రసాద్, బాల్యంలోని పిల్లల ముచ్చట్లు కథనాలుగా అక్షరబద్ధం చేసారు'. 'మా అమ్మాయి వాళ్ల పిల్లల అల్లరి గురించి రాసింది, మరి నేను మా అమ్మాయి, మా అబ్బాయిల గురించి రాయవద్దా!' అంటూ అంగలకుదిటి గోవిందమ్మ రచించిన నాలుగు కథనాలు తల్లి, కుమార్తెల అద్భుత ఆత్మీయ అనుబంధాన్ని కుటుంబ సాహితీ బాంధవ్యాన్ని స్పష్టం చేస్తున్నాయి. సాధారణంగా పిల్లలు పెద్ద వాళ్లయిన తర్వాత, మరింత పెద్దరికం మీదపడిన తల్లులు, పిల్లల చిన్నప్పటి కథనాలు 'నీదు చిన్నప్పుడు' అంటూ చెప్తుంటారు. కాని డా॥రాణీప్రసాద్ ఆమె మాతృమూర్తి గోవిందమ్మ, పత్రికలకు బాలసాహిత్యంలో భాగంగా రాయడం అరుదై, ఆసక్తికరమైన జ్ఞాపకాలను రచనలుగా గుబాళింప చేయడం అవి పుస్తకంగా వెలుగు చూపడం అభినందనీయం. పిల్లల అమాయకత్వం, చిన్నప్పటి వారి అచ్చట్లు, ముచ్చట్ల గుర్తుకొచ్చి పెద్దల పెదవులపై నవ్వులు విరబూయిస్తాయి. 'తల్లి లేకపోతే ఎంతో కష్టం' కథనంలో సృష్టిలో తల్లిపాత్రను దేవుడు ఎంత గొప్పగా సృష్టించాడో' అంటారు రచయిత్రి. కుటుంబ వాతావరణం పిల్లల భవిష్యత్‌ను ఎలా తీర్చిదిద్దుతుందో, బాల్యంలో పిల్లల ఆలోచనలు, ఆసక్తి ఈ పిల్లల కథనాలు ప్రతిభావంతంగా స్పష్టం చేస్తున్నాయి. **(ఏనుగును పెంచుకుందాం! రచన: డా॥కందేపి రాణీప్రసాద్, వెల: రూ 100, ప్రతులకు: కె.రాణీప్రసాద్, ఎం.డి. సృజన్ చిల్డ్రన్స్ హాస్పటల్, సిరిసిల్ల)**

**- యర్రమిల్లి**

నాటికాలంతో పోలిస్తే, నేటికాలంలో స్త్రీలు అన్ని రంగాలలో ప్రవేశించి తమ ప్రావీణ్యాన్ని లోకానికి చాటి చెబుతున్నారు. పురుషులతో సమానంగా రాణిస్తూ, 'మేము కూడా ఎందులోనూ తీసిపోలేదు' అని నిరూపిస్తున్నారు. సమానమని నిరూపిస్తూనే తమ ప్రత్యేకతను ప్రదర్శిస్తున్నారు. ఆడపిల్లను అక్షరంగా..పదతులను పదంగా..



## రెప్పవెనుక స్వప్నం, రెప్పవిప్పితే మాయం

వనితలను వేకువాక్యంగా..తన మనసుదీపంతో వెలిగించాలన్న తపనతో రాసిన పదికథల సంపుటిలో రచయిత్రి సుజాతాప్రసాద్, కథనంతోనే కథను సృష్టించగలిగారు. చుట్టూ చోటు చేసుకుంటున్న సామాన్య సంఘటనలకే మెరుగులద్దారు. ఒక తల్లి దేశాన్ని వీడిపోలేని తనం (జననీ జన్మభూమిశ్చ..కథ) ఉన్న ఊరిని వదిలి వెళ్లినా, ఉండలేనితనం (మరో అమ్మ) పరాయిబిడ్డను పెంచటం అనుకున్నంత సులువు కాదనటం (మాతృత్వపు మమకారం) కాలం కన్నాముందే ఆలోచించగలగటం (పరోపకార్థమిదం శరీరం) ఒక పరిపూర్ణ వ్యక్తిగా, అంతకుమించి పరిపూర్ణ స్త్రీగా ఆలోచించి రాసిన కథలు ఇవి. కథ, కథనం, ఎత్తుగడ, ముగింపు అన్నీ పరిపూర్ణత్వంతో అలరారే కథలు. తొలి కథాసంపుటియె అయినా, స్త్రీ కేంద్రీయ, మానవత్వ స్పర్శ, కారుణ్యదృష్టి గల కథలు. **(రెప్ప వెనుక స్వప్నం, రచన: ఎర్రగుంట సుజాతాప్రసాద్, వెల: రూ 120, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్)**

**- కూర చిదంబరం**

ఆంధ్రప్రదేశ్ డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) రజతోత్సవ సందర్భంగా వెలువరించిన కవితా సంకలనం 'కవితాలయ'. ఈ సంపుటిలో ఫెడరేషన్ సభ్యుల కవితలేగాక కొందరు ప్రముఖులు రాసిన కవితలను గూడ



## డిటిఎఫ్ రజతోత్సవ సంకలనం..కవితా'లయ'

పొందుపరిచారు. విద్యారంగ ప్రాధాన్యత గల రచనలతోబాటు సామాజిక సమస్యలపై స్పందిస్తు రాసిన కవితలకు గూడ చోటు కల్పించారు. మొత్తానికి అన్ని కవితలూ డిటిఎఫ్ ఆలోచనా విధానాన్ని ప్రతిబింబించేవి కావడం గమనార్హం. హెచ్.సి.యు.విద్యార్థి రోహిత్ మరణం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి మనకందరికి తెలిసిందే. పి.రవీందర్‌రెడ్డి ఆ సంఘటనను గుర్తు చేసుకుంటూ 'ఎంత పొరపాటు చేశావ్ రోహిత్/ గడ్డుకాలంలో పుట్టిన గుడ్డువురా/ మరణాన్ని వాయిదా వేయాల్సింది' అనడంలో ఏ సమస్యకూ చావు పరిష్కారం కాదు అన్న సందేశం యిమిడి వుంది. కె.ఎస్.వై.పతంజలి 'ఎన్నికలైపోయిన తర్వాత దేశమంతా ఎలాగుంటుంది?' అని ప్రశ్నిస్తారు 'దగాపడిన ఒక ఆడ కూతురిలాగా వుంటుంది' అని వర్ణిస్తారు. 'ఉపాధ్యాయుడికి ఉత్తరం' పేరిట కట్టగాని రవీందర్, అబ్రహాంలింకన్ కవితకు స్వేచ్ఛానువాదం అందించారు. **(డిటిఎఫ్ రజతోత్సవ సంకలనం, డెమోక్రటిక్ టీచర్, ఫెడరేషన్, వెల: రూ 100, ప్రతులకు: ఉపాధ్యాయక్రాంతి, 1/13వ రోడ్డు, బ్రాడీపేట, గుంటూరు)**

**- రమణ వెలమకన్ని**

మన రాష్ట్రంలో ప్రఖ్యాతిగాంచిన గుహలు లేదా బిలాలలో ప్రథమస్థానంలో ఉన్నవి బొర్రాగుహలు. తరువాత ఆ స్థాయిలో కాకున్నా స్థానిక ఆకర్షణ పొందుతున్నవి నంద్యాల జిల్లాలోని బెలూంగుహలు. వీటికి భిన్నంగా ఉండే గుహలు కూడా ఉన్నాయి. అవే పల్నాడు జిల్లాలోని గుత్తికొండ గ్రామ సమీపంలోని గుహలు.

# గోపాలుడు నడయాడిన గుత్తికొండ బిలం

ఇలపావులూరి వెంకటేశ్వర్లు



క్షేత్రగాథ ప్రకారం గుత్తికొండ బిలం పౌరాణిక చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ప్రదేశం. అనేకమంది మహర్షులు ఇక్కడ తపస్సు చేశారని చెప్తారు. గత శతాబ్దంలో ఎందరో మహనీయులు ఇక్కడ ఆధ్యాత్మిక సాధన చేసి ముక్తిని పొందారని అనేక గాథలు ప్రచారంలో ఉన్నాయి.

## క్షేత్రగాథ

పురాణాలలో చూసినట్లయితే మహర్షుల తపోభూములు ఎక్కువగా నదీతీరాలలో అంటే నీటివసతి ఉన్న కొండగుహలలో, దట్టమైన వనాలలో ఉన్నట్లుగా తెలుస్తుంది. జలం జీవం కదా! వివిధ ప్రాంతాలలో కనిపించే ఆలయాలు వారు తమ నిత్యపూజల నిమిత్తం ఏర్పాటు చేసుకొన్నవి అని కూడా అర్థం చేసుకోవచ్చు. తొలి గుహాలయాలు పల్లవుల కాలంలో నిర్మించినట్లుగా తెలుస్తోంది. గుత్తికొండ బిలం పురాణ ప్రాముఖ్యం తెలుసుకోవాలంటే భాగవంతంలోని కొన్ని గుత్తికొండ క్షేత్రగాథ ప్రధానంగా ముచికుందుడు అనే మహారాజుతో ముడిపడి ఉన్నది. ఎవరీ ముచికుందుడు?

## ముచికుందుడు

భాగవత పురాణంలో ఈయన ప్రస్థావన ఉన్నది. సూర్యవంశానికి చెందిన మాంధాత మహారాజు పుత్రుడు. అనేక పురాణాలలో పేర్కొన్న అంబరీష మహర్షి ఈయన సోదరుడు. గొప్పయోధుడు. సామ్రాజ్యాన్ని నలుదిశలా విస్తరింపచేసాడు. ధర్మబద్ధంగా ప్రజారంజకంగా పాలన చేసేవారు. ఆయన కీర్తి, ధైర్యసాహసాలు దేవలోకాన్ని చేరుకొన్నాయి. ఆ సమయంలో అసురులతో పోరాడుతున్న అమరులు ఓటమి అంచున ఉన్నారు. దేవేంద్రుడు శ్రీమహావిష్ణువు సలహా మేరకు దూతలను ముచికుందుని వద్దకు పంపి యుద్ధంలో సహాయం చేయమని అర్థించారు. వారి కోరికను మన్నించి దేవదానవ యుద్ధంలో పాల్గొన్నారు ముచికుందుడు. ఎన్నో సంవత్సరాలు గడిచిపోయాయి. దేవతలను విజయం వరించింది. ఆదిదంపతుల కుమారుడైన శ్రీసుబ్రహ్మణ్యస్వామి దేవసేనాధిపతిగా బాధ్యతలు స్వీకరించారు. ముచికుందుడు శ్రీమహావిష్ణువును సందర్శించుకున్నారు. ఆయనను భూలోకానికి వెళ్లడానికి అనుమతి కోరారు. శ్రీహరి ఇప్పుడు భూలోకంలో ద్వాపరయుగం నడుస్తోంది. నీ అన్న వారంతా గతించారని అన్నారట. అప్పుడు ముచికుందుడు నా అలసట తీరేలా నిద్రించాలి. నాకు నిద్రాభంగం కలిగించినవారు నా కంటి చూపుతో భస్మం అయిపోయేలా వరం ప్రసాదించండి అని కోరుకొని భూలోకానికి వచ్చి గుత్తి కొండబిలంలో నిద్రపోయారు. కాలం గడిచిపోతోంది.



## కాలయవనుడు

గర్గుడు అనేరాజు యాదవ గురువుతో జరిగిన పండిత చర్చలో ఓడిపోయారట. ఆ అవమానం తట్టుకోలేక మహేశ్వరుని తపస్సుతో ప్రసన్నం చేసుకొని యాదవుల చేతిలో ఓడిపోని కుమారుని పొందారట. అతనే కాలయవనుడు. ఇతను బ్రహ్మ నుండి ఎవరి చేతిలో ఓటమి పొందకూడదని వరం పొందాడట. కొన్ని లక్షల సైన్యంతో ఎందరినో ఓడించి వరగర్వంతో శ్రీకృష్ణుని మీదకు యుద్ధానికి సిద్ధపడసాగాడట కాలయవనుడు.

## జరాసంధుడు

మగధ సామ్రాజ్య పాలకుడు, కంసుని అల్లుడు. తన మామని చంపిన శ్రీకృష్ణ బలరాముల మీద పగతో మధురానగరం మీదకు పెక్కుసార్లు దండయాత్ర చేసి అన్నిసార్లు ఓడిపోయాడు. పగా తీరే మార్గం కోసం వెతుకుతుండగా కాలయవనుని విషయం తెలిసింది. అతనిని తనకు సహాయపడమని కోరాడు. ఎప్పటి నుండో శ్రీకృష్ణుని మీద ద్వేషంతో ఉన్న కాలయవనుడు మధురానగరానికి బయలుదేరాడు. కొంతకాలం కిందటే జరాసంధునితో యుద్ధం గెలిచిన బలరామకృష్ణులు కాలయవనుని దండయాత్ర గురించి తెలుసుకొని ప్రజలను మధుర నుండి ద్వారకకు పంపించివేశారు. శ్రీకృష్ణుడు ద్వంద్వయుద్ధానికి రమ్మని చేసిన సవాలును స్వీకరించిన కాలయవనుడు ఒంటరిగా వచ్చాడు. అతనికి ఉన్న వరాల సంగతి తెలిసిన వాసుదేవుడు ఓడిపోయినట్లుగా పారిపోసాగారు. కోపంతో కాలయవనుడు ఆయనను తరమసాగాడు. గోపాలుడు నేరుగా ముచికుందుడు నిద్రిస్తున్న గుహలోనికి వెళ్లారు. ఆవేశంతో లోపలికి ప్రవేశించిన కాలయవనునికి చీకటిలో శత్రువు కనిపించక వెతుకుతూ నిద్రిస్తున్న ముచికుందుని పట్టుకొన్నాడు. నిద్రాభంగం కలగడంతో కనులు తెరిచిన ముచికుందునికి ఉన్న వరప్రభావంతో కాలయవనుడు భస్మం అయిపోయాడు. వరగర్వంతో లోకాలకు కీడు చేస్తున్న ఒక లోకకంటకుడి మరణం సంభవించినది గుత్తికొండ బిలంలో అన్నది క్షేత్రగాథ. కాలయవనుని మరణం తరువాత శ్రీకృష్ణుని దర్శనం పొందిన ముచికుందుడు ఇక్కడ తపస్సు చేసుకున్నారట. నేటికీ ఆయన అర్హులైన భక్తులకు దర్శనమిస్తారని, ఉపదేశం చేస్తారని కొన్ని గాథలు ప్రచారంలో ఉన్నాయి.



## యోగిని కోలా పోలమాంబ

సమీపంలోని పిడుగురాళ్ల మండలంలోని జూలకల్లు గ్రామానికి చెందిన శ్రీలింగారెడ్డి పుత్రిక యోగిని కోలాపోలమాంబ. స్వయంగా ముచికుంద మహర్షి సాక్షాత్కారం, ఉపదేశం పొందిన మహనీయురాలు. ఎన్నో సంవత్సరాలు ఇక్కడ తపస్సు చేశారని తెలుస్తోంది. సుమారు ఎనభై సంవత్సరాల క్రిందట యోగిని జీవసమాధి చెందినా నేటికీ భక్తులను అనుగ్రహిస్తుంటారని చెబుతుంటారు. ఆమె జీవసమాధి, యోగిన శిష్యురాలైన శనగపాటి సుభద్రమ్మ సమాధిని ప్రాంగణంలో దర్శించుకోవచ్చును. ప్రాంగణంలో శ్రీరాజరాజేశ్వరి సమేతశ్రీ మల్లికార్జున స్వామివార్ల సన్నిధులు. శ్రీగణపతి నాగప్రతిష్టలు కనిపిస్తాయి. స్వామివారిని శ్రీబాల మల్లేశ్వరస్వామి అని పిలుస్తారు.

## గుత్తికొండ బిలం

చుట్టూపచ్చని పొలాలు. పచ్చని పరిసరాలు. స్వచ్ఛమైన గాలి. ప్రశాంత వాతావరణం నడుమ ఉంటుంది గుత్తికొండ బిలం. గుత్తికొండ ఊరి నుండి సుమారు నాలుగు కిలోమీటర్ల మట్టిదరిలో ప్రయాణించాలి. ఎత్తులో ఉన్న ఆలయ ప్రాంగణం వరకు రహదారి ఉన్నది. ప్రాంగణంలోని ఆలయాలను, జీవసమాధులను చూపిన తరువాత బిలంలోనికి వెళ్లడానికి మనిషికి ముప్పై రూపాయల టికెట్. బిలం పక్కన భరతమాత సన్నిధి ప్రత్యేకం. బిలం యొక్క ముఖద్వారంపైన క్షేత్రగాథను తెలిపేలా మధ్యలో ముచికుంద మహర్షి ఇరుపక్కలా శ్రీకృష్ణుడు కాలయవనుడు విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇది ఒక మునివాటిక. అక్కడ ఉండే మునుల్లో ఒకరైన అవధూతశ్రీ స్వయం ప్రకాశస్వామివారు బిలంలో శివలింగాన్ని 1754వ సంవత్సరంలో ప్రతిష్ఠించారని ఇక్కడి శాసనం తెలుపుతుంది. ఆ లింగాన్ని 'చీకటి మల్లయ్య' అని పిలుస్తారు. సహజసిద్ధంగా ఏర్పడిన ఇందులోనికి వెళ్లడానికి గతంలో కాగడాలు తీసుకొని వెళ్లేవారు. బిలంలోనికి ప్రవేశించిన తరువాత మొదట దర్శనమిచ్చేది శ్రీముచికుంద మహర్షివిగ్రహం. పక్కనే శ్రీ చీకటి మల్లయ్య లింగం. గతంలో మొత్తం నూట ఒకటి బిలాలు ఉండేవట. కాలక్రమంలో ప్రస్తుతం ఏడుమాత్రమే మిగిలాయి. అందులో కూడా రెండు మాత్రమే చివరిదాక వెళ్లడానికి అనువుగా ఉంటాయి. చీకటి మల్లయ్య సన్నిధి దిగువన కొండరాళ్లను తొలగించి విశాలమైన ప్రదేశాన్ని తయారు చేశారు. అక్కడ నుండి రెండుదారులు రెండు గుహలకు దారితీస్తాయి. మొదటిది రేణుకా గుహ చాలా లోపలికి ఉంటుంది. ఎత్తు తక్కువ ఉన్నమార్గంలో ఏర్పాటు చేసిన మెట్లమార్గంలో వెళ్లాలి. విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసారు. గొప్ప అనుభూతి. గుహ చివర ఎక్కడ నుండి వస్తాయో తెలియదు స్వచ్ఛమైన నీరు. చల్లని నీటితో మొహం కడుక్కొని రెండుగుక్కలు తాగితే ఎక్కడలేని శక్తి ఉత్సాహం కలుగుతాయి. రెండవ గుహకు నూతనంగా మెట్లను ఏర్పాటు చేశారు. ఎదురుగా జలం కనిపిస్తుంది. దీనిని బ్రహ్మనాయుడి బిలం అంటారు. రేణుక బిలం మాదిరిగా కాకుండా ఇది విశాలంగా ఉంటుంది. యాత్రికులు ఎక్కువగా ఇక్కడే స్నానం చేస్తారు.

## పల్నాటి బ్రహ్మనాయుడు

మహాభారత యుద్ధంతో సరిపోల్చదగినది పన్నెండవ శతాబ్దంలో కారంపూడి వద్ద నాగులేటి ఒడ్డున నలగామ రాజు, మలిదేవ రాజుల సైన్యాల మధ్య జరిగిన భీకరయుద్ధం. విద్యావేత్త, రాజకీయ తంత్రాలలో మేటి, గొప్పయోధుడు, చక్కని సలహాదారుడు అన్నింటికి మించి సంఘసంస్కర్త. తొమ్మిది వందల సంవత్సరాల కిందటి సమాజంలోని కిందివర్గాలకు తన ఆస్థానంలో సముచిత స్థానం ఇచ్చారు. యోధానుయోధులందరూ మరణించి యుద్ధం ముగిసిన తరువాత నలగామరాజుకు రాజ్యం అప్పగించి బ్రహ్మనాయుడు గుత్తికొండ బిలంలో చాలా కాలం ధ్యానంలో ఉండిపోయారని అంటారు. బిలంలోనికి వెళ్లిన తరువాత ఆయనను చూసినవారు ఎవ్వరూ లేరు. బిలంలో జరిపిన అన్వేషణలో బ్రహ్మనాయుడు ఉపయోగించిన ఆయుధం పురావస్తుశాఖ వారికి లభ్యమయ్యింది అని తెలుస్తోంది. నూతనంగా నిర్మించిన మెట్ల వద్ద శ్రీబ్రహ్మా నాయుని విగ్రహం ఉంచడం సముచితంగా ఉన్నది, నీరు ఎక్కడ నుండి వస్తుందో కానీ కొండరాళ్లు తేమగా ఉంటాయి. ముఖ్యంగా రేణుక బిలంలోనికి వెళుతున్నపుడు ఒక సాహస కార్యం చేస్తున్న అనుభూతి కలుగుతుంది. గుత్తికొండ బిలం వెళ్లడం అంటే పౌరాణిక చారిత్రక నేపథ్యం కలిగిన ప్రదేశంలో చేసే ఒక సాహస ఆధ్యాత్మిక యాత్ర!





కథ

# కప్ప తెలివి

సుందరవనం అనే అడవిలోని ఒక మడుగులో ఒక కప్ప నివసించేది. ఒకసారి ఆ కప్ప ఆహారం కొరకు ఆ మడుగు నుండి బయటకు వచ్చింది. వెంటనే ఒక రాయి చాటుగా ఉన్న ఒక పాము దానిని తన నోటికి చేజిక్కించుకుంది. అప్పుడు కప్ప 'అయ్యో! నేను ఆ నీటిలో ఉన్నా బాగుండేది. ఆకలి ఎంత పని చేసింది? ఆ ఆకలి వల్లే నేను బయటకు వచ్చాను. ఆ పాముకు దొరికిపోయాను. ఈ పాము నన్ను తినక తప్పదు. ఇప్పుడు చివరి ప్రయత్నంగా ఏదైనా ఉపాయం ఆలోచిస్తాను' అని అనుకొంది. వెంటనే దానికి చటుక్కున ఒక ఉపాయం తోచింది.



అది పాముతో 'ఓ సర్పమా! నీకు ఎలుకలు ఇష్టమా! కప్పలు ఇష్టమా!' అని అడిగింది. అందుకు పాము 'ఎలుకలు' అని అంది. 'మరి కప్పనైన నన్ను పట్టుకున్నావేమిటి?' అని అడిగింది కప్ప. 'నాకు చాలా ఆకలిగా ఉంది. ఏం చేయాలి? నీవు సమయానికి దొరికావు. అందుకే నిన్ను పట్టుకున్నాను' అని అంది పాము. 'అయ్యో! పాపం నీకు ఇష్టమైన ఎలుకలు దొరకలేదు. కదూ! సరే! మరి నేను నీకు ఎలుక కన్నాన్ని చూపిస్తాను. నన్ను వదిలి పెడతావా!' అని అడిగింది తప్ప. సరేనంది పాము.

ఆ కప్పదారి చెబుతుంటే పాము ఆ ఎలుక కన్నం వద్దకు బయలుదేరింది. కొద్దిదూరం వెళ్లిన తర్వాత ఆ కప్ప పామును ఆపి'అదిగో! అక్కడ ఆ కన్నంలో ఎలుక ఉంది చూడు!' అని అంది. 'అలాగే! అయితే అది దొరికితే నిన్ను వదిలిపెడతాను' అంది పాము. 'ఓ సర్పమా! నీవు ఆ కన్నంలోకి చూడు. నీకు ఎలుక కనబడుతుంది' అంది కప్ప. 'ఏదీ! నీవే నాకు అడ్డుపడుతున్నావు' అంది పాము. 'అందుకే నన్ను వదిలిపెట్టు. నేను ఎక్కడికి పోనులే!' నీకు ఎలుక దొరికేంతవరకు నేను ఇక్కడనే ఉండి నీకు దానిని పట్టిస్తాను' అని అంది కప్ప. పాము దాని మాటలు నమ్మి కప్పను వదిలి దానిపై ఒక కన్ను వేసి ఉంది. పాము వదిలిపెట్టిన ఆ కప్ప అక్కడనే ఉంది. మాటిమాటికి ఆ పాము కప్పవంక చూస్తూనే ఉంది.

తర్వాత ఆ పాము కన్నంలోనికి తొంగి చూడసాగింది. దానికి ఎలుక కనిపించలేదు. 'అయ్యో! ఈ కన్నంలో ఎలుకలేదేమిటి' అని అడిగింది పాము. అప్పుడు కప్ప 'అలా కాదు. నీవు ఆ కన్నంలో నీ మూతిని మొత్తం పెట్టి చూడు' అని అంది. పాము సరేనని తన మూతిని ఆ కన్నంలో పెట్టింది.

'ఆ..ఆ..అలా..ఇంకా లోపలికి నీ మూతిని చొప్పించి చూడు. అది ఎక్కడికి పోదులే! నీకు దొరికినట్టే!' అని ఉత్సాహపరిచింది కప్ప. పాము సంతోషించి ఇంకా కొంచెం లోపలికి తన మూతిని పెట్టి చూసింది. అందులో కప్ప చెప్పినట్టు దానికి ఒక ఎలుక కనిపించింది. వెంటనే పాము ఆ ఎలుకను పట్టుకొని బయటకు తీసింది. ఆ తర్వాత ఆ పాము దానిని పరిశీలించి చూస్తే అది ఒక బొమ్మ ఎలుక. ఆ బొమ్మ ఎలుకను ఒక కోతి పట్టుకొని వచ్చి ఆ ఎలుక కన్నం ముందు పడవేస్తే దానిని ఆ కన్నంలోని ఎలుకలోనికి పట్టుకొని వచ్చింది. ఆ పాము దానిని నిజమైన ఎలుక అనుకొంది. ఆ పాము నిరాశతో వెనక్కి తిరిగి కప్పవైపు చూసింది. కానీ అక్కడ కప్పలేదు. అది పక్కనే ఉన్న ఏ రాయి కిందకో పారిపోయింది.

ఇంతలో దాని నివాసానికి వస్తున్న ఆ కన్నంలోని నిజమైన ఎలుక ఆ పామును చూసి వెనుకకు తిరిగి పారిపోయింది. అది చూసిన పాము 'అయ్యో! ఆ కప్ప మాటలకు మోసపోయి దొరికిన ఆహారాన్ని పోగొట్టుకున్నానే!' అని చింతించింది.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య





పసుల పాలపిట్ట వెన్నెల
వార్త ఆదివారం

## బాలగేయం

### భావి పౌరులు



పూల తోటలో
మెరిసే రంగురంగుల
సీతాకోక చిలుకలు
నీలి ఆకాశంలో
ఎగిరే అందాల
బుజ్జి పావురాలు
చక్కని జలాశయంలో
విచ్చుకొన్న అందాల
కలువ పువ్వులు
దేవునిగుడిలో
భక్తులే భజనలు
చేసే బాల భక్తులు
అందాల పాఠశాలలో
బుద్ధిగా పాఠాలు
నేర్చే బంగారు బాలలు
నేటి భారత్‌లో
చిన్నారి బాలలే
రేపటి భావిపౌరులు

– చాడా మునిశేఖర్‌రెడ్డి

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎస్.వనజాక్షి,** నాయుడుపేట

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. రైలు కూతలలో ఏమైనా ప్రత్యేక అర్థాలు ఉన్నాయా?

**జవాబు: వనజాక్షి!** మనం రైలు బయలుదేరే ముందు గట్టిగా కూత వేయడం, మధ్యలో అక్కడక్కడా ఇలాగే గట్టిగా సైరన్ మోగించడం వింటుంటాం. రైలు డ్రైవరు తన ఇష్టం వచ్చినప్పుడు ఎప్పుడైనా కూత పెట్టవచ్చా? అంటే మాత్రం వీలు లేదనే చెప్పాలి. రైలు కూత పెట్టిన ప్రతీ సందర్భానికి ఒక్కో ప్రత్యేకత ఉండాల్సిందే. అందులోని అర్థాలు రైల్వేలో పనిచేసేవారికి మాత్రమే అర్థమయ్యే కోడ్ భాషలా అనిపిస్తుంది. బ్రిడ్జీలు, టన్నెళ్లను దాటుతున్నప్పుడుగానీ, స్టేషన్లను దాటుతున్నప్పుగానీ గమనిస్తే రైలు చేసే చప్పుడులో ప్రత్యేకత కనిపిస్తుంది. స్టేషన్ దగ్గరవుతున్నప్పుడూ, దాటుతున్నప్పుడూ సుదీర్ఘమైన కూత వినిపిస్తుంది. రైల్వేలో ఇంజిన్ విజిల్ కోడ్‌కు ఒక ప్రత్యేకత ఉంది. అంటే కూత వ్యవధి, సంఖ్యలను బట్టి ప్రతి రైలుకూతకూ ప్రత్యేకమైన అర్థం ఉంటుందన్నమాట. రైలు డ్రైవర్లు రైలుకూతను ఏ సందర్భాల్లో ఉపయోగిస్తారో తెలుసా? రైలు ఇంజిన్ కదలికకు ముందూ, సొరంగం(టన్నెల్‌లోకి వెళ్లేముందూ, ఏవైనా ప్రత్యేక ఆదేశాలున్నాప్పుడూ, ప్రమాదమేదైనా జరిగి అవరోధం ఏర్పడి రైలు కదలలేని పరిస్థితుల్లో రైలు నుంచి తక్కువ వ్యవధిలో కూతలు నాలుగు సార్లు వినిపిస్తాయి. అప్పుడు గార్డు వాటిని అర్థం చేసుకుని బ్రేకులు వేస్తాడు. రైలు లెవెల్ క్రాసింగ్‌కు దగ్గరైనప్పుడు బాగా పొడవైన కూత విన్పిస్తుంది. టన్నెల్ సమీపించినప్పుడూ ఇంతే. ఈ కూత రైల్వే పట్టాల మీదుగా నడుస్తున్న ప్రజలకూ, లేకుంటే టన్నెల్లో ఉన్నవారికీ హెచ్చరిక అని అర్థం చేసుకోవాలి. ఒకప్పుడు కేవలం 'కూ' అంటూ రైలే పెట్టే కూతే ఎన్నో సందేశాలను అందించేది.

# తగ్గుతున్న పుస్తక పఠనం




విశ్వరహస్యాలను తెలుసుకోవడానికి, అంతరిక్ష గుట్టును విప్పడానికి, ప్రముఖుల జీవిత విశేషాలను అర్థం చేసుకోవడానికి, మనం చూడని ప్రదేశాలను అక్షరయాత్రలో వీక్షించడానికి, మానవ నాగరికత పరిణామాన్ని తెలుసుకోవడానికి, జీవితాన్ని సుసంపన్నం చేసుకోవడానికి, లక్ష్యాలను సునాయాసంగా ఛేధించడానికి, మనలోకి మనం తొంగి చూడడానికి, చీకటిదారుల్లో వెలుతురు మార్గాన్ని ఎన్నుకోవడానికి, నీ గూర్చి నువ్వు అవగాహన పరచుకోవడానికి, మానవ జీవితాల్లో సంక్లిష్టతలను జీర్ణించుకోవడానికి, జీవిత పరమార్థాన్ని అర్థం చేసుకోవడానికి, విజ్ఞాన వివేకాలను సమపార్జించడానికి, ఊహా జగత్తులో విహరించడానికి, ఆలోచనాశక్తిని విస్తృత పరచుకోవడానికి అందుబాటులో ఉన్న ఏకైక ఉత్తమ సాధనం

డా॥ బుర్ర మధుసూదన్‌రెడ్డి

పుస్తకాలను చదవగలగడమే అని చరిత్ర నిరూపించింది. పుస్తకపఠన నైపుణ్యంతో వివిధ అంశాలను అధ్యయనం చేసి తెలియని విషయపరిజ్ఞానాన్ని తెలుసుకోవడం, మానసిక వికాసదిశగా అడుగులు వేయడం, అజ్ఞాన చీకట్ల నుంచి విజ్ఞాన వెలుగుల దిశగా పయనించడమే 'పుస్తకపఠన కళ లేదా ఆర్ట్ ఆఫ్ రీడింగ్' అని అర్థం చేసుకోవాలి. మనకు వచ్చిన సందేహాలను, అర్థవంతమైన ప్రశ్నలకు చక్కటి సమాధానాలను ప్రదానం చేసేదే పుస్తకపఠన కళ అవుతుంది.

## పుస్తకపఠన ప్రయోజనాలు

పుస్తకం చదవడం శ్వాస తీసుకోవడం లాంటిది. ఒక పుస్తకం, ఒక కలం, ఒక గురువు, ఒక బ్లాక్‌బోర్డు అనేవి ప్రపంచాన్ని మార్చగలిగే మహత్తర శక్తిని కలిగి ఉంటాయి. సంపాదన కరిగిపోవచ్చు. భూములను కోల్పోవచ్చు, ధనాన్ని ఖర్చు చేయవచ్చు, కాని పుస్తకం ద్వారా నేర్చుకున్న విజ్ఞానం తరిగిపోలేని అపూర్వ శాశ్వత ఆస్తిఅవుతుంది. పుస్తక పఠనంతో విజ్ఞాన వికాసం, వివేకం విప్పారడం, సమాచారం తెలుసుకోవడం, ఊహల రెక్కలు విచ్చుకోవడం, జీవితంలో కొత్త కోణాన్ని చూపించడం, కెరీర్‌ను మెరుగుపరచుకోవడం, క్రమశిక్షణ పెంచుకోవడం, ఉన్నత ఉద్యోగాన్ని పొందేలా ఉపకరించడం, నూతన ఆలోచనలకు బీజాలు పడడం, చరిత్రను తెలుసుకోవడం, సామాజిక సంబంధాలను మెరుగుపరచుకోవడం, మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవడం, ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడం, పరిశోధనాత్మక ఊహాశక్తిని కలిగించడం, గొప్ప వారి జీవిత చరిత్రలు తెలుసుకోవడం, ఆకర్షణీయ వ్యక్తిగా ఎదగడం, పదజాల విస్తరణ, ఆశావహ దృక్పథాన్ని పెంచడం/ మార్చివేయడం, వినోదాలను అందించడం, విశ్రాంతి వేళ మంచి నేస్తంగా మారడం, స్ఫూర్తిని అందించడం, మెదడు వికసితం కావడం, స్వతంత్ర ఆలోచనామృత శక్తిని పెంపొందించడం, సత్యాన్ని శోధించడం, సృజనాత్మకత పెంచడం, విశ్లేషణాత్మక సామర్థ్యాన్ని పెంచడంలాంటి ప్రయోజనాలతో మనసుకు స్వేచ్ఛను కలిగించి సన్మార్గాన్ని చూపిస్తుంది. బహుముఖ మానసిక వికాసానికి, భాషలో పట్టు సాధించడానికి, పేరు ప్రఖ్యాతుల సంపాదనకు పుస్తకపఠనం దోహదపడుతుందనడంలో సందేహం లేదు. ఏకాగ్రతతో చదవడం వల్ల పారిభాషిక పదకోశం, విషయ అవగాహన, క్రిటికల్ థింకింగ్, అనలిటికల్ థింకింగ్, జీవితాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవడం, జ్ఞాన/ భాషాప్రవాహం, రాయడం/వేగంగా చదవడమనే కళను తెలుసుకోవడం, ప్రపంచాన్ని చూపించే గవాక్షంగా, పఠనాభిలాష పెరగడం, అల్పజ్ఞాని నుంచి మేధావి వరకు ఎదిగేందుకు ఉపకరించడం లాంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయి.



చిన్నతనం నుంచే పిల్లలకు పుస్తకాలు చదవడమనే అలవాటు చేస్తే వారు భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదుగుతారని గత అనుభవాలు రుజువు చేస్తున్నాయి.



## డిజిటల్ యుగంలో పుస్తకపఠనం

మంచి పుస్తకాన్ని చదివినప్పుడు పొందే అనుభూతులు వర్ణనాతీతమని మనకు తెలుసు. నేటి ఆధునిక వేగవంతమైన జీవితంలో అనంత సమాచారం మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న సమయంలో చదవడానికి తీరికలేని ఆధునిక ఉరుకులు పరుగులు మన ఊపిరిని శాసిస్తున్నాయి. ఆఫ్‌లైన్‌లోగాని, ఆన్‌లైన్‌లోగాని చదవడం విధిగా అలవాటు చేసుకోవాలి. మనలోని సృజనను తట్టి లేపడానికి పుస్తక పఠనం ఇంధనంగా పని చేస్తుంది. చరిత్రలో నిలిచిన వారందరూ చదువు మహిమను అవగతం చేసుకున్నవారే అని మనకు తెలుసు. 'పుస్తకాలు నా మనసుకు దగ్గరైన నేస్తాలు, నా గృహమే వేల పుస్తకాలతో కూడిన ఓ గ్రంథాల దేవాలయం, పుస్తకాలే నా వద్ద ఉన్న అపూర్వ సంపద' అంటూ భారతరత్న ఏపిజె అబ్దుల్‌కలాం అన్న వాక్యాలు మనకు గుర్తున్నాయి. దేశ జనాభా ఏకాగ్రతతో చదివితే దేశం అభివృద్ధి దిశగా కదులుతుందని మనం నమ్ముతున్నాం. దేశం అసలైన ఆస్తి మేధో సంపదే అని మనం గుర్తించాం. జాతీయ విద్యా విధానం-2020 ఉద్దేశ్యాల్లో విజ్ఞాన సమాజస్థాపన, ప్రపంచస్థాయి మేధోసంపత్తి నిర్మాణం, ప్రపంచ విలువలను ప్రేగు చేసుకోవడం లాంటివి నిర్ణయించడం జరిగింది.

## విద్యతోనే బహుముఖీన వికాసం

గొప్ప పుస్తకాల పఠనం మన జీవితాలను మలుపు తిప్పగలవు, మరికొన్ని అశ్లీల పుస్తకాలు పాతాళంలోకి కూడా నెట్టగలవు. కొన్ని పుస్తకాలను స్పృశించి వదిలేయడం, మరి కొన్నింటిని లోతుగా అర్థం చేసుకోవడం, కొన్ని పునశ్చరణ చేసుకోవడం పాఠకుడికి తెలియాలి. చిరిగిన చొక్కానైనా తొడుక్కొని ఒక మంచి పుస్తకాన్ని కొనుక్కోమని పెద్దలు అంటూ వస్తున్న విషయం మనకు తెలుసు. విద్యావంతమైన సమాజం ద్వారా రాజకీయ, సామాజిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక వికాసం రాజ్యమేలుతుందని తెలుసుకోవాలి. విద్యావంతులు అధికంగా ఉన్న దేశాలు అభివృద్ధిలో ముందుండడం, తలసరి ఆదాయాలు అధికంగా ఉండడం, జీవన ప్రమాణాలు మెరుగుపడడం, శాంతి నెలకొనడం, క్రమశిక్షణ కలిగిన సమాజ విలువలు నెలకొనడం తప్పనిసరిగా జరుగుతుంది. పుస్తకపఠనాన్ని నమ్ముకున్న సమాజంలో ఆలోచనాశక్తి పెరగడం, ఆవిష్కరణలు బయటపడడం, విలక్షణ ఆలోచనలు పురుడుపోసుకోవడం అనాదిగా జరుగుతూనే ఉన్నది. నేటి అంతర్జాల వలయంలో చిక్కిన యువత పుస్తకపఠనానికి ద్వితీయ ప్రాధాన్యం ఇవ్వడం, దృశ్యశ్రవణ వీక్షణకు మొగ్గు చూపడం రాబోయే ప్రమాదానికి సంకేతంగా నిలుస్తున్నది.

## జాతీయ డిజిటల్ లైబ్రరీ స్థాపన

పుస్తకపఠన ప్రాధాన్యాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఇటీవల 'జాతీయ డిజిటల్ గ్రంథాలయాలను' ఏర్పాటు, ప్రఖ్యాత పుస్తకాలను పౌరులకు అందుబాటులో ఉంచడానికి సంకల్పించడం ముదావహం. గ్రామ పంచాయితీల్లో గ్రంథాలయాల పుస్తకపఠనాన్ని పెంచాలని ఉద్దేశించినవే అని తెలుసుకోవాలి. దేశంలో అక్షరాస్యత రేటు కన్న విద్యావంతులు రేటు పెరిగితేనే దేశం అసలైన సుస్థిరాభివృద్ధిని పొందుతుందని మనకు విధితమే. పుస్తకాలను చదివి శారీరక మానసిక వికాసాన్ని పెంచుకుంటూ, ఉద్యోగ ఉపాధులను పొందడం జరగాలి. చదువుకున్న వారికి అనంత అవకాశాలు ద్వారాలు తెరచుకొని ఉంటాయి.

అనంతజ్ఞానం పుస్తకాల్లో నిక్షిప్తం కావడంతో దానిని ఆస్వాదించడానికి పఠనశక్తిని పెంచుకోవాలి. చదవడమనే అలవాటు మెదడుకు చైతన్యం కలిగించడమే కాకుండా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి పునాదిగా కూడా పని చేస్తుంది. మనకు ఏం తెలియకపోయినా ఫరవాలేదు కాని మన సమీపంలో గ్రంథాలయం ఎక్కడ ఉందో తెలియడం ప్రధానమని నమ్ముదాం. పుస్తకాలు చదవడం అలవాటుగా చేసుకుందాం. పుస్తకాలు అపారజ్ఞాన నిధులు, సంతోషానికి పునాదులు. 'విద్యలేని వాడు వింత మనిషి అయితే విద్యావంతుడు అనంత శక్తిమంతుడు' అని నమ్మాలి. నేటి విద్యావంతులందరూ ప్రాంతీయభాష, జాతీయభాష, అంతర్జాతీయ భాషా పుస్తకాలను చదువుతూ విద్యావేత్తలు గానే కాకుండా సంస్కారవంతులుగా దేశాభి వృద్ధిలో భాగస్వామ్యం తీసుకుందాం. అజ్ఞాన చిక్కటి చీకట్ల సమాజంలో విజ్ఞానకాంతులను నలుదిశగా వెలిగిద్దాం.

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.
sunmagvaartha@gmail.com

కథ

చెంగల్వల కామేశ్వరి

# గూడు లేని గువ్వ

**"ఓకేనండీ! తాళాలు వాచ్‌మెన్‌కి ఇచ్చేస్తాను. కరెంట్ బిల్ కట్టేసాను. మెయింటెనెన్స్ కూడా ఇచ్చేస్తాను. రేపు ఉదయం వెకేట్ చేసేస్తున్నాను" అని ఇంటి ఓనర్‌కి చెప్పి ఫోన్ కట్ చేసింది నాగమణి.**

నాగమణి మనసంతా కెలికినట్లు ఉంది. అయిదేళ్ల నుండి ఉన్న ఇల్లు. ఖాళీ చేసి మళ్లీ కొత్త ఇల్లు, కొత్త పరిసరాలు మళ్లీ సేమ్ స్టోరీస్ చెప్పుకుంటూ కొత్త ఇంటివారితో కలిసి మెలిసి ఉండి చుట్టుపక్కల వారితో మంచి అనిపించుకుని మనుగడ సాగించాలి.. అనుకుంటూ ఒక్కసారి నిట్టూర్చి అలా ఇల్లంతా తిరుగాడింది.

నీట్‌గా సర్దుకున్న హాలు. గదిగోడలకు మ్యాచింగ్ కర్టెన్స్, అందమయిన ఎల్ షేప్ సోఫా, టపాయ్‌కి ఉన్న గ్లాస్ లోపల నుండి తాను కలెక్ట్ చేసిన రంగు రంగుల గాజుగోళీలు మెరుస్తూ ఆకట్టుకుంటున్నాయి. తన స్వహస్తాలతో తయారు చేసిన ఎన్నో కళాకృతులు, అల్మారాలు నిండిన తను సంపాదించుకున్న ఆస్తులు వందల మెమొంటోస్, ఒక రూమ్‌లో తన బెడ్ పక్కన ఉన్న బుక్ షెల్ఫ్‌లో కొలువు తీరిన తను రాసిన పుస్తకాలు.. మరో షెల్ఫ్‌లో తనకిష్టమయిన పుస్తకాలు. ఆ షెల్ఫ్‌ల పైన ప్రముఖులతో దిగిన ఫొటోలు, సన్మాన పత్రాల ఫొటోఫ్రేమ్‌లు.

మరో రూమ్‌లో ఉన్న బీరువాలో, అల్మారాలలో వరసగా పేర్చిన రకరకాల బట్టలు.. కోడళ్లకి, కూతుర్లకి మొహమెత్తి ఎవరికయినా ఇచ్చేయమని ఇచ్చిన ఖరీదైన చీరలు.

ఎప్పటికప్పుడు తనవి పిల్లలవి గుళ్లల్లో, వృద్ధాశ్రమాల్లో పంచుతున్నా ఎప్పుడూ నిండుతూనే ఉంటాయి. ఇంకో రూమ్ ఇంచుమించు స్టోర్ రూమ్‌లాగే రకరకాల సామాన్లతో ఉంది. కిచెన్‌లో అటక పైన వారసత్వంగా వచ్చిన అత్తింటి ఇత్తడి సామాన్లు, అమ్మమ్మ, బామ్మల వారసత్వంగా పుట్టింటి నుండి తెచ్చుకున్న పెద్ద పెద్ద వంట సామగ్రి.

"అవన్నీ ఎందుకు? ఎవరికయినా ఇచ్చేయొచ్చు కదా!" అంటే-

శుభ కార్యాలప్పుడు ఎవరినడగాలి? ఏది పడితే అది వండే గిన్నెల్లో వండటం ఎలా? అనుకుని ఇంట్లో ఉంచినా, చుట్టాలు ఎవరి ఇంట్లో ఫంక్షన్ అయినా పట్టుకెళ్లి ఇస్తున్నారు. ఉండనీలే!" అని



ఉంచినవే.

"ఇప్పుడు ఇవన్నీ తీసుకుని ఎక్కడికి వెళ్లాలి, ఎలా సర్దాలి? ఈ ఇంట్లోకి వచ్చి పదేళ్లయింది. అంతకుముందు ఇంకో ఇంట్లో పదేళ్లు. అంతకుముందు ఇంకో ఇల్లు.. అందులో పదేళ్లు. ఇలా తన పెళ్లయిన దగ్గర నుండి ఏభయ్యేళ్లు రకరకాల అద్దిళ్లలో ఉండి పిల్లల్ని కని పెంచి పెద్ద చేసి పెంచుకున్న సంసారం! పిల్లల పెళ్లిళ్లు ఇక్కడే చేసినా పెద్ద కొడుకు, ఇద్దరు కూతుళ్ల పురుళ్లూ అమెరికాలోనే అయ్యాయి.

ఎన్ని ఇళ్లు మారినా ఇంట్లో జనాల వల్ల అందరూ తలో గది సర్దేవారు. ఈ ఇంట్లోకి రాకముందే ఆయన వెళ్లిపోయారు. ఇందులోకి వచ్చిన ఏడాదికే, ఆఫీస్ తరపున అమెరికా వెళ్లిపోయిన చిన్న కొడుకు, కోడలు, పిల్లలు కూడా అమెరికా వెళ్లారు. తనని ఒక్కదాన్ని ఉంచడం ఇష్టం లేదని అమెరికా వచ్చేయమని పిల్లలు బలవంతం చేసారు కానీ, తనకంటూ ఏర్పర్చుకున్న ప్రపంచంలో ఇక్కడే ఉంటాననీ, రావాలి.. అనిపించినప్పుడు వస్తానని చెప్పి ఒప్పించింది.

మీకు ఇల్లు లేకపోవడమేమిటి? అని ఆశ్చర్యపోయినా, ఇంత ఖర్చు పెడతారు ఒక ఇల్లు కొనేలా ప్లాన్ చేసుకోండి! అని సలహాలు ఇచ్చినా, పెద్దవాళ్లు త్వరలో ఇల్లు కొనుక్కోవాలి అని ఆశీర్వదించినా పెద్దగా పట్టించుకోలేదు.

మాకులా సొంత ఇల్లు కాదుగా! ఏ ఇబ్బంది వచ్చినా మారిపోవచ్చు అని వెటకారాలాడినా, 'వెయ్యిళ్ల పూజారి' అని టైటిల్ ఇచ్చినా గింజుకోలేదు.

తన భర్త రెండు మూడు సార్లు ప్రయత్నించినా సఫలం కాలేదు. ఆ విషయం తనకి తెలిసి ఎలా ఒత్తిడి తెస్తుంది? దేనికయినా రాత ఉండాలి అని సరిపెట్టుకుంది.

చాలీచాలని జీతాలు.. పిల్లల చదువులు, బాధ్యతలు, పెళ్లిళ్లు, ఆయన అనారోగ్యాలు, ఆరోగ్య సమస్యలతో సగం జీవితం వెళ్లిపోయింది. చివరికి అద్దె ఇంట్లోనే ఆయనా రాజపూజితంగా వెళ్లిపోయాక కూడా తమకు ఇల్లు లేదనే చింత కలగలేదు. పిల్లలు అందరూ ఇళ్లు కొనుక్కున్నారు. అటూ ఇటూ బంధు వర్గాలలో ఇల్లు లేనిది తమకే! అని కొందరు కావాలని సానుభూతి చూపిస్తే తనకి చిరాకొచ్చేది.

'స్వంత ఇల్లు లేకపోతే ఏమయింది? తల దాచుకోడానికి సకల సదుపాయాలతో ఉన్న మంచి ఇంట్లోనే ఉంటున్నాం కదా! ఆకలేస్తే నచ్చినది తినడానికి, కట్టుకోడానికి ఇష్టమయిన బట్టలు, తల దాచుకోడానికి గూడు ఇవే కదా కావాలి. అవి కూడా లేని నిరుపేదలు ఉన్నారు. వారికన్నా బాగానే ఉన్నాం.

ఈ మాత్రం జీవితాన్ని ఇచ్చిన ఆ దేమునికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ తమని తాము సమర్థించుకునేది భర్త దగ్గర.

ఆయన చిరునవ్వుతోనే "నువ్వు అల్పసంతోషివే. ఏదీ లేకున్నా అన్నీ ఉన్నట్టే ఆనందిస్తావు. అందుకే నీకు నా లాంటి నీ కోసం ఏమీ చేయలేనివాడిని ఇచ్చాడు" అనేవారు.

"చాల్లెండి పిచ్చిమాటలు.. ఇప్పుడు మనకొచ్చిన లోటు ఏమీ లేదు. మన పిల్లలు కొనుక్కుంటే మనకి ఆనందమే కదా!" అని సర్ది చెప్పేది.

ఆయన వెళ్లిపోయాక ఇల్లు మారినప్పుడు, మారినప్పుడల్లా ఏసిలు, గీజర్స్, ఫ్యాన్స్, చిమ్నీ.. మార్చడం, ప్యాకర్స్ అండ్ మువర్స్ వారికి, ఎలక్ట్రీషియన్స్ కి, ప్లంబర్స్ కి, హెల్పర్స్ కి వేలకు వేలు డబ్బులు ఖర్చు అవుతుంటే మనసు చివుక్కుమనడం ప్రారంభించింది.

అప్పుడయితే కుటుంబం తనతో ఉంది. ఇప్పుడు అందరూ ఉండి తాను ఏకాకి. అటువంటప్పుడు ఎవరికీ అవసరం లేని ఈ సామాన్ల కోసం తను కాపలా ఉండాలా? డెబ్బై సంవత్సరాల వయసులో ఇంత ఇల్లు, ఈ సామాన్లు గతించిన ఏ వైభవాలు తెస్తాయి?

అందుకే తనకి తెలిసిన సేవా సంస్థకు చెప్పేసింది.. వ్యాన్ తీసుకురమ్మని. తనకు ముఖ్యంగా అత్యవసరమైనవి కావాల్సినవేవో ఉంచుకుని ఒక రూమ్ కిచెన్‌లోకి షిఫ్ట్ అయిపోదామని అనుకుంది. విలువయిన బంగారునగలు, వెండి సామాన్లు అమ్మేసి ఆ డబ్బ బ్యాంక్‌లో వేసేసింది.

మెడలో ఉన్న సన్న బంగారు గొలుసు, చెవులకు చిన్న దుద్దులు, చేతికి వాచీ తప్ప మరేది ఉంచుకోలేదు.

తను ఎక్కడయినా హాస్టల్‌లో ఉందామంటే అవెక్కడో బోలెడు దూరం. అంతకన్నా దగ్గరలోనే ఉంటే మంచిదని ఆలోచన వచ్చింది. వెంటనే అమలుపర్చింది. పిల్లలు వచ్చినా వాళ్ల అత్తారిళ్లల్లోనే ఉంటారు. మధ్యలో తనను చూడటానికి వస్తారని ఈ తాపత్రయాలు దేనికి?

భార్యాభర్తలలో ఒకరే మిగిలితే వారు సర్వం కోల్పోయినట్లే! ఏదీ మిగలదు. మిగుల్చుకుని ఏం చేసుకోవాలి? తన పుట్టుక, తల్లిదండ్రుల దగ్గర, తన మనుగడ, వివాహం, దాంపత్యం, పిల్లలు, పెంపకం బాధ్యతలు, వియోగం... ఇవన్నీ గడచిన కాలం కరిగిపోయిన మధుర స్వప్నం!

పిల్లలు తనకోసం ఇల్లు కొనిస్తామని అంటే తిరస్కరించింది. "ఇల్లు కట్టవలసిన ఆయన కట్టలేదు. కలిసి గృహప్రవేశం చేసుకోలేదు. స్వంత ఇల్లు మా రాతలో లేదు. లేనిదానికోసం తాపత్రయం నాకు లేదు. ఇప్పుడు మీ కష్టార్జితంతో నాకు ఇల్లు కొనిచ్చి, దానిని సరిగ్గా మెయింటెయిన్ చేయటం లేదు అన్న మాటలు వినాలి. నా తదనంతరం అది నా ఇల్లుగా ఎవరికి ఇవ్వాలి, ఇచ్చినవాళ్లకే ఇస్తే వాళ్లిల్లు అద్దె లేకుండా నేనున్నట్లే కదా! అందరూ కలిసి కొన్నా వాటాలేసి ఇవ్వడానికి అది నా స్వంత ఇల్లు కాదు, వద్దు" అని చెప్పేసింది.

చివరకు మిగిలింది గమ్యం లేని ఈ శేష జీవితంలో సుదీర్ఘ విరామం. శాశ్వత ఏకాంతం. అలా ఇల్లంతా తిరుగాడి ప్రతీ వస్తువును అది ఇంట్లోకి ఎలా వచ్చిందో! అదెవరు ఇచ్చారో! ఎవరు కొన్నారో జ్ఞప్తికి తెచ్చుకుంటూ, వారందర్నీ గుర్తు చేసుకుంటూ పొంగిన దుఃఖం కళ్లమ్మట ధారలుగా కారుతుంటే తుడుచుకుంటూ ఉన్న నాగమణి 'రాలిపోయే పూవా నీకు రాగాలెందుకే, తోటమాలి నీ తోడు లేదులే' అన్న పాట వినిపించి "అవును నాకు ఇంకా ఇవన్నీ ఎందుకూ!" అనుకుంటుండగా అది తన మొబైల్ ఫోన్ రింగ్‌టోన్ అని గుర్తు వచ్చి గబగబా ఫోన్ ఆన్ చేసింది నాగమణి.

అవతల ఎవరిదో కొత్త మగ గొంతు "నమస్తే.. మీరు గొట్టు నాగమణిగారేనా!" అనడిగిన ప్రశ్నకు–

"అవునండీ" అని నాగమణి జవాబు వినగానే అవతలి నుండి "మీకు కంగ్రాట్యులేషన్స్.. మేం జిహెచ్ఎంసి నుండి మాట్లాడుతున్నాం. మీరు ఇంటికోసం అప్లై చేసారు కదా, మేం తీసిన అయిదు వందల పేర్ల లాటరీలో మీ పేరు వచ్చింది.

మీకు గచ్చిబౌలి టిఎన్‌జీవో కాలనీలో గవర్నమెంట్ కట్టించిన డబుల్ బెడ్ ఫ్లాట్ వచ్చింది. రేపు మీ ఆధార్ కార్డు, ఫోటోలు, అకనాలెడ్జ్‌మెంట్ తీసుకుని మన జిహెచ్ఎంకి వచ్చేయండి" అని చెప్పగానే సంభ్రమాశ్చర్యాలతో "అవునాండీ! నిజమేనా?" అని అడిగిన నాగమణికి– "నిజమమ్మా! రేపు పది గంటలకు వచ్చేయండి. రేపు మీ అందర్నీ లొకేషన్‌కి తీసుకెళ్లి మంత్రుల చేతుల మీదుగా మీ ఇంటి తాళాలు మీకు హ్యాండోవర్ చేస్తాం" అని చెప్పి ఫోన్ పెట్టేసాడా అవతలి వ్యక్తి.

> **ఆయన చిరునవ్వుతోనే "నువ్వు అల్పసంతోషివే. ఏదీ లేకున్నా అన్నీ ఉన్నట్టే ఆనందిస్తావు. అందుకే నీకు నా లాంటి నీ కోసం ఏమీ చేయలేనివాడిని ఇచ్చాడు" అనేవారు.**

ఆనందాశ్చర్యాలతో అంతా ఒక కలగా అనిపించి ఉబ్బి తబ్బిబ్బు అయింది నాగమణి. గోడకి తగిలించి ఉన్న భర్త ఫొటోకి అప్రయత్నంగానే నమస్కరించి "ఏమండీ చూసారా! మనకి ఇల్లొచ్చింది. పిచ్చిది, ఒంటరిది అని మీరే నాకు ఈ అదృష్టాన్ని కలిగేలా ఆశీర్వదించారా! కానీ మీరు లేకుండా మన స్వంత ఇంటికి నేనొక్కదాన్నే వెళ్లాలా? సర్లెండి.. నా దేముడు మీరే కదా! మీ ఫొటో తీసుకుని వెడతాను. మనిద్దరం కలిసి వెళ్లినట్లే అనుకుందాం" అని అనుకుంటుంటే నాగమణి కళ్లు నీటితో తడిసి జలపాతాలయ్యాయి.

జిహెచ్ఎంసి అతను చెప్పిన పేపర్స్ ఎక్కడున్నాయో! వెతకాలి... ఏమిటో ఏడ్చి ఏడ్చి కళ్లు మసకబారుతున్నాయి. గాబరాగా ఉంది.. అనుకుంటూ అక్కడే ఉన్న సోఫాలో కూలబడింది.

మది నిండిన సంతోషంతో కనులు మూసుకున్నాయి. పట్టలేని ఆనంద హేలకు ఉక్కిరి బిక్కిరి అవుతున్నానేమో! ఇంత ఆనందాన్ని ఈ ముసలి గుండె తట్టుకోలేదు. పిల్లలకి చెప్పాలి. ఈ శుభవార్త. అనుకుని టీపాయ్ మీద ఉన్న ఫోన్ అందుకోబోయింది. గుండెలో కలుక్కుమని నొప్పికి తట్టుకోలేక అమ్మా! అని గుండె చేత్తో పట్టుకుని నాకు ఏమౌతోంది.. ఎందుకిలా? అనుకుంటూ మగతలోకి జారుకుంది.

మూతలు పడుతున్న ఆమె కళ్లల్లో తాను వెళ్లబోతున్న తన గూడు కదలాడింది.

అనుకోకుండా వచ్చిన అదృష్టానికి అవసరానికి మించి కొట్టుకున్న ఆ ముసలి గుండె ఆనందానికి ఎగసిపడి ఆ పైన ఆగిపోయింది. 'గూడొచ్చింది కానీ గూటిలో ఉండాల్సిన గువ్వ ఎగిరిపోయింది. ✦

# పొగడ్త-బహుమతి

యామిజాల జగదీశ్

ఒకరు బహుమతి ఇచ్చారంటే అర్థమేమిటీ? మరొకరి ప్రతిభను గుర్తించి కొనియాడి ఏదో ఒకటి ఇచ్చారని అర్థం. మన ప్రతిభను గుర్తించి మరొకరు మనకు ఏదైనా ఇస్తే అది బహుమతి.

అలా కాకుండా మనమే ఒకరి వద్దకు వెళ్లి నాకున్న ప్రతిభ సామాన్యమైనది కాదనీ, కనుక నాకొక బహుమతి ఇవ్వండి.. అని అడగకూడదు. అలా అడిగి తీసుకోవడం అనేది బహుమతి కాబోదు.

బహుమతి అనేది ఇంకొకరు ఇచ్చేదే తప్ప మనకు మనం అడిగి పొందడం కాదు. కానీ ఈ రోజుల్లో అది కాస్తంత భిన్నంగా ఉంటోంది. అందుకే మనం దానిని అలాగే చెప్పడం మొదలుపెట్టాం. ఇదిగో చూడు.. "ఈ యేడాది ఈయన ప్రథమ బహుమతి అందుకున్నారు" అని చెప్పడం లేదు. బహుమతి తీసుకున్నతనని గురించి అడిగితే "వారివ్వలేదు.. అందువల్ల నేనే అడిగి తీసుకున్నాను" అంటాడు. ఇంతకూ సముచితమైన బహుమతి అనేది ఏది?

బహుమతి పొందాలంటే అందుకు తగిన ప్రతిభ ఉండాలి. బహుమతి ఇచ్చే మనకీ దాని గురించి తగిన అవగాహన ఉండాలి.

అనగనగా ఓ రాజు ఉండేవాడు. ఆ ఊళ్లో చిత్ర విచిత్రాలు చేసే ఓ వ్యక్తి ఉన్నాడు. అతని గురించి ఆ నోటా ఈ నోటా విన్న రాజు అతనిని సభకు తీసుకురమ్మన్నాడు. రాజు పిలుస్తున్నాడు కదా అని అతనూ సభకు వెళ్లాడు.

"నీకు ఏయే విద్యలు వచ్చు?" అని అడిగాడు.

అప్పుడతను "నాకు మంత్రాలు తంత్రాలు రావు. కానీ ఒకటి రెండు విచిత్రాలు చేసి ఆశ్చర్యపరచగలను" అన్నాడు.

"అవేంటో చెప్పు" అన్నాడు రాజు.

"తాడు మీద నడుస్తాను. అలాగే పొడవాటి ఓ వెదురు కర్రను నాటి దాని మీదకు తలకిందులుగా పైకెళ్లడం చేతనవును" అని చెప్పాడు. ఆ కర్ర అగ్రభాగానికి చేరుకున్నాక ఓ నల్చదరం ముక్కను చక్రంలా తిప్పుతాను" అన్నాడు. ఆవులా నాలుగు కాళ్లతో నడుస్తాను. ఆవులా అరుస్తాను. ఏకదమ్మున వంద గుంజీళ్లు తీస్తాను" అన్నాడు.

తాను చేసేవన్నీ ఎంతో అణకువగానే చెప్పాడతను.

రాజుకు సంతోషమేసింది. వెంటనే చెప్పాడు.

"అలాగా! అయితే సరే. వచ్చే



శుక్రవారం నాలుగు గంటలకు ఇక్కడికి రా. ఇక్కడి మైదానంలో అందరి సమక్షంలో నీకు తెలిసినవన్నీ చేసి చూపించు" అన్నాడు.

"నువ్వు చేసేవన్నీ చూసి ఊరిప్రజలు కూడా ఆనందించాలి" అని చెప్పాడు.

"అలాగే రాజా!" అని అతను వెళ్లిపోయాడు.

శుక్రవారం వచ్చింది. సరిగ్గా సాయంత్రం నాలుగు గంటలకు అతను రాజుగారి కోటలోని మైదానానికి చేరుకున్నాడు.

రాజు ఓ పెద్ద సింహాసనంలో కూర్చున్నాడు.

ఊరి ప్రజలందరూ గుమిగూడారు.

అతను తనకు చేతనైనవన్నీ చేసి చూపించడం మొదలు పెట్టాడు.

ఆవులా నటించడం మొదలు పెట్టాడు. ఆవులా అరిచాడు.

అతని ప్రదర్శన చూడటానికి వచ్చిన ప్రేక్షకులలో ఓ కుర్ర పశువుల కాపరి కూడా ఉన్నాడు. అతను ఓ చిన్న రాయి తీసి పశువులా అరుస్తున్న వ్యక్తి మీద నెమ్మదిగా విసిరాడు. అంతేకాదు.. ఈల వేస్తూ బాగా చేసావు... అని చప్పట్లు చరిచాడు.

చిత్ర విచిత్రాలు చేస్తున్న వ్యక్తి తన మీద "ఎందుకు రాయి విసిరావని?" అడగలేదు.

తన ప్రదర్శనను చూసి అందరూ ఆనందించినందుకు అతనూ సంతోషించాడు.

ప్రదర్శన ముగిసింది.

అందరూ మళ్లీ చప్పట్లు కొట్టారు.

రాజు అతనిని దగ్గరకు రమ్మనమని పిలిచాడు. ఒక ముత్యాల హారాన్ని అతనికి కానుకగా ఇచ్చాడు. అతను దానిని తీసుకున్నప్పటికీ కుర్ర పశువుల కాపరి ఇచ్చిన చిరిగిన బొంతకు ఎంతో సంతోషించాడు. అతని పాదాలకు మొక్కాడు.

రాజుకి, ఇతరులకు అతని వైఖరి ఏమీ అర్థం కాలేదు.

ఈ విషయం గ్రహించిన అతను "రాజా! ఈ కుర్రాడు నా విచిత్ర ప్రదర్శనను సరిగ్గా అర్థం చేసుకున్నాడు. నేను ఆవులా నటిస్తున్నప్పుడు అతను నా మీద చిన్న రాయి విసిరాడు. ఆవు శరీరంలో ఎక్కడైనా ఏదైనా తగిలితే వెంటనే ఆ చోట మాత్రమే నొప్పెడుతుంది. ఆ కాపరి రాయి విసిరినప్పుడు అది తగిలిన చోట మాత్రమే నా వేళ్లతో రాస్తూ అతని వంక చూసాను అతను అప్పుడు "సెభాష్" అన్నాడు.

అందువల్లే అతనిచ్చిన చినిగిన కంబళిని అందుకోవడం తృప్తిగా ఉందన్నాడు. నా ప్రతిభను అతను సరిగ్గా అర్థం చేసుకున్నాడు" అని కూడా చెప్పాడు.

అతను చెప్పినదంతా విన్న రాజు కోప్పడలేదు. పైపెచ్చు ఆ పశువుల కాపరి కుర్రాడిని పిలిచాడు. అతనికి కూడా ఓ ముత్యాల హారం ఇచ్చాడు.

అర్థవంతమైన ప్రశంసలు, బహుమతి అంటే ఇదే మరి. మిగిలిన ప్రశంసలన్నీ ఉత్తవే.

(మిగతా 28వ పేజీలో..)




# తెలుగు అక్షరం ఎటు పోతోంది?

జయసూర్య

తెలుగుభాష వర్ణమాలలో 36 అక్షరాలున్నాయి. సంస్కృతంలోంచి కొన్ని అక్షరాలకు తెలుగులిపి తయారు చేసుకొని 56 అక్షరాలుగా ఆంధ్రభాష రూపొందింపచేసుకొన్నాం. సంస్కృతం+తెలుగు=ఆంధ్రభాష అని అర్థం. ఆంధ్రభాష అంటే కేవలం ఆంధ్రాలో ఉండే భాష అనుకోవద్దు. తెలుగు మాట్లాడే, తెలుగువాళ్లుండే ఏ రాష్ట్రమైనా, ఏ దేశమైనా ఆంధ్ర అనే మాట భాషా పరంగా వర్తిస్తుంది. సంస్కృతంలో ఉండే అక్షరాలన్నీ తెలుగులో ఉంటాయి. సంస్కృతంలో మాత్రం ఉండి తత్సమాల వల్ల తెలుగులో చేరే అక్షరాలు పందొమ్మిది ఉన్నాయి. తెలుగులో మాత్రం ఉన్న అక్షరాలు అంటే సంస్కృతంలో లేనివి ఆరు ఉన్నాయి. ఈ ఆరు అక్షరాలలో ఏదీ సంస్కృతంలో లేకపోవడం తెలుగుభాష విశిష్టత. తెలుగు పండితులు సంస్కృతం స్వీకరించారు. వ్యాకరణంలో అనుశాసనం కల్పించారు. బాల వ్యాకరణం, సంజ్ఞా పరిచ్ఛేదము-4 ప్రకారం "ఋ, ౠ, విసర్గ ఖ, ఛ, ఠ, ధ, ఫ, ఘ, ఝ, ఢ, థ, భ, ఙ, ఞ, శ, ష లు సంస్కృత సమంబులగూడి తెలుగున వ్యవహరింపబడు". ధ్వనులు ఎక్కడ బడితే అక్కడ ఉండరాదు. సంస్కృత సమములలో మాత్రమే ఉంటాయి. తెలుగుకు లక్షణాన్ని చేసి రూపురేఖలు దిద్దిన పండితులు అందరూ సంస్కృతానికి ఆంధ్రానికి అంతరాన్ని నిలపాలని తలంచారు.

అన్నమాచార్యుల సంకీర్తనలలో అద్భుత ప్రయోగాలున్నాయి. రాగిరేకులపై నిక్షిప్తమైన పద సంపదలోని విశేష ప్రయోగాలు ఆలస్యంగా వెలుగు చూసాయి. వ్యవహారిక భాషా వికాసం అందువలన ఎంతో కోల్పోయింది. అన్నమయ్య ప్రజాకవి. "నిండారరాజు నిద్రించు నిద్రయునొకటే/అండనే బంటు నిద్ర అదియు నొకటే, మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి యొకటే, ఛండాలుడుండేటి సరిభూమి యొకటే.... తందనాన" సామ్యవాదాన్ని 500 సంవత్సరాలకు పూర్వమే తెలుగులో మాట కంటే పదునైన పాటలో సంగీత మాధ్యమంలో చెప్పిన అన్నమయ్య 'తెలుగు' మనుగడకు జీవం అందించారు.

"కడగి ఏనుగు మీద కాయునెండొకటే, పుడమి శునకము మీద పొలయు నెండొకటే" అంటూ ప్రకృతి స్వరూపుడైన పరమాత్మ నీరు, నేల, గాలి రూపాలను ప్రసరింపచేస్తున్నారనడం అన్నమయ్య భావామృత సందేశం. వాడుకలో ఉన్న తెలుగు పలుకుబడిని, పాటగా సంకీర్తనా రూపంగా అజరామరం చేసిన అన్నమయ్య తెలుగు భాషా సరస్వతి నిత్య ఆరాధ్యులు. కొండలలో నెలకొన్న కోనేటి రాయుని కరుణతో కొండలంత పద సంపద, భావాత్మక అద్భుత రీతిలో సృష్టించిన "తేనెల పైతేట తిన్నని చెరుకు" మాధుర్యంతో "ఆడిన మాటెల్ల అమృత కావ్యంగా పాడిన పాటెల్ల పరమ గానం"గా పరవశింపచేసిన రాగిరేకులపై ఎన్నో మాటలు, పదబంధాలు ప్రాచుర్యంలోకి రావలసి వుంది.



ఆంధ్ర భాషకు వున్న 56 అక్షరాలతో అజంతా భాషగా ఈ మాధుర్యం ప్రపంచంలో ఏ భాషకు లేదు. పదాలలో విరుపులు, అర్థం మార్పులు, జిలుగులు ఏ భాషకు లేవు. తెలుగు పలుకుబడి చమత్కారపూరితం. అర్థవంతమైన పదాలు మన భాష సంపద. అక్షరం, అచ్చు, గుణింతం, వత్తు ఎక్కడ చిన్న తప్పు చేసినా అర్థాలు మారిపోయే సున్నితత్వం తెలుగు అక్షరాల సొత్తు. స్వంతం, అక్షరంలో అచ్చులకు సంబంధించి దీర్ఘం వస్తే అర్థం మారిపోతుంది. విపరీతార్థాలు, అక్షరం పెరిగితే కూడా అంతే. ఈ రోజులలో కొన్ని అక్షరాలు వదిలేస్తున్నాం. భాషను చక్కగా ఉపయోగించుకోవాలన్నా, ఆకళింపు చేసుకోవాలన్నా, కవిత్వం రాయాలనుకున్నా అక్షరాలను ప్రేమించాలి. ఏ భాషలో ఏ పదాన్నైనా తనలో చేర్చుకొని ఇముడ్చుకొనే జీవత్వం తెలుగు భాషకే ఉంది. రాసినట్టే ఉచ్చరించడం, ఉచ్చరించినట్లే రాయడం తెలుగుకు ఉన్న ప్రధాన లక్షణం. ఏ భాషకు ఈ సౌలభ్యం లేదు అన్నారు ఆచార్య సి.నారాయణరెడ్డి. తెలుగు పతాకం ఎగురని దిశయే లేదు అన్నారు దాశరథి. ఏ వస్తువునైనా ఎన్నుకొని క్లిష్టమైన ఛందోరీతులలో గాఢమైన భావ వ్యక్తీకరణతో అలంకారాల జిలుగులతో సూక్ష్మదృష్టితో తొలి తెలుగు మహాకవి పాల్కురికి సోమనాథుడు, తెలుగు సాహిత్యంలో దేశీ ఛందస్సును విస్తృతపరిచి ద్విపద ఛందస్సులో బహుముఖీన ప్రజ్ఞను ప్రదర్శింపచేసారు. లిఖిత, మౌఖిక సంప్రదాయానికి వారధి నిర్మించిన అగ్రగామి సోమనాథుడు. భారతీయ భాషలలో తెలుగు జాతీయ భాషగా అగ్ర స్థానం అలంకరించాలంటే అన్య దేశ్య పదాల ఆక్రమణను అరికట్టాలి. తెలుగు భాషా పదజాలం కనుమరుగయ్యే, సన్నగిల్లే ప్రమాదాన్ని తెలుగు ప్రేమికులు, అభిమానులు పసికట్టాలి. నూతన తెలుగు పదాలను సృష్టించుకోవాలి. అన్నిటికీ మించి తెలుగు మాట్లాడగలిగే పిల్లలు కూడా రాయటం చేతకాని దుస్థితి, చదవడం రాదు అనే పరిస్థితి దుర్భరం. అందరూ ఆలోచించి అధిగమింపచేయాలి. అక్షరాల వినియోగంలో 'ఙ' మొదలైనవి కనుమరుగైనా ళ, ఋ, శ, ఝ వంటి అక్షరాలను అర్థవంతంగా పదిలపరచు కోవాలి. ముఖ్యంగా భాష అధ్యయనంలో ప్రాథమిక స్థాయిలో తెలుగు అక్షరాలు అచ్చులు, హల్లులు పాఠ్యాంశ ప్రణాళికను సున్నితమైన అర్థాలు వివరించే మాటలు మరుగున పడకుండా భాషను కాపాడుకొనే అధ్యయన, పరిశోధనలతో పాటు పుస్తక పఠనాసక్తి మరింత పెంపొందింపచేయాలి. ✦

# అపార్టుమెంటువాసులు

**నిత్యం** అపార్ట్‌మెంట్ గొడవల వల్ల తలనొప్పితో సతమతమవుతున్న సెక్రటరీ కాస్త రిలీఫ్ కోసం ఐమాక్స్‌లో మ్యాట్నీ షోకి భార్యతో కలిసి వెళ్లాడు. ఆ రోజంతా మనస్ఫూర్తిగా ఎంజాయ్ చేసి ఇంటికి తిరుగు ప్రయాణం అయ్యాడు. చీకటిపడే వేళ అపార్ట్‌మెంట్ చేరుకునేసరికి కారు పార్కింగ్ ఏరియాలో జనం గుమిగూడి ఉన్నారు. ఆ రోజంతా ఎంజాయ్ చేసిన సెక్రటరీ ఆనందం ఒక్కసారిగా ఆవిరైపోయింది. "ఎవరో పోయినట్టున్నారు" అనుకుంటూ కారు గేటు బయటే ఆపి లోపలికి వెళ్లాడు.

"అదిగో సెక్రటరీగారు వచ్చారు" అన్నారెవరో. సెక్రటరీ కళ్లు శవం కోసం వెతుకుతున్నాయి. అందరూ గుంపుగా నుంచోవటంతో "ఎవరు?" వాచ్‌మ్యాన్‌ని అడిగాడు. "304 ఆయన" అన్నాడు వాచ్‌మ్యాన్.

"అయ్యో పాపం! అలా ఎలా?" దిగ్భ్రాంతికి లోనయ్యాడు సెక్రటరీ.

"అదిగో వస్తున్నాడుగా.. అతన్నే అడగండి" అన్నాడు వాచ్‌మెన్. "పోయినవాడు రావడం ఏమిటి?" అని ఆలోచిస్తున్న సెక్రటరీ ముందు 304 ఆయన వచ్చి నిల్చున్నాడు.

"ఏమీ లేదు సెక్రటరీగారు, ఈ మధ్య వాచ్‌మెన్ ప్రవర్తన బాగాలేదు. అందుకే ఈ సమావేశం"

"అసలు ఏమైంది?"



"బట్టలు ఇస్త్రీ చేసే విషయంలో గొడవ జరిగింది. దాంతో వాచ్‌మ్యాన్ గురించి రకరకాల ఫిర్యాదులు అందాయి. అపార్ట్‌మెంట్‌వాళ్ల బట్టలు లేటుగా ఇస్త్రీగా చేస్తున్నాడని, బయట కాలనీవాళ్ల బట్టలు త్వరగా చేసి, వారిపైన ఎక్కువ అభిమానం చూపిస్తున్నాడని, మన విషయాలన్నీ బయటివాళ్లకు చేరవేస్తూ ఇక్కడి వారిని చిన్నచూపు చూస్తున్నాడని, అపార్ట్‌మెంట్ పనులు చేయకుండా బయటవారి పనులకు వెళ్తున్నాడని.. ఇలా రకరకాలుగా చెప్పుకొచ్చారు" అన్నాడు తాపీగా.

"ఉన్నపళంగా వెళ్లిపొమ్మంటే పాపం వాచ్‌మ్యాన్ ఎక్కడికి పోతాడు? ఈ నెలాఖరు వరకు టైమిద్దాం" సర్ది చెప్పాడు సెక్రటరీ.

నెలాఖరుకొచ్చింది. వాచ్‌మెన్ విషయం మళ్లీ తెరపైకి వచ్చింది. "రెంటుకున్న వారికిచ్చే విలువ ఇక్కడున్న ఓనర్లకి ఇవ్వడం లేదు" వాచ్‌మెన్ పైన మరో ఫిర్యాదు చేస్తూ అతన్ని తీసెయ్యాల్సిందేనని అందరూ పట్టుబట్టారు. ఇక చేసేదిలేక వాచ్‌మ్యాన్‌ని తొలగించి, కొత్త వాచ్‌మ్యాన్‌కి పోస్టింగ్ ఇచ్చేశారు.అతనికి ఇస్త్రీ చేయడం రాదు. ఇక ఎవరికి వాళ్ల సెల్ఫ్ ఇస్త్రీనే. కొండనాలుక్కి మందేస్తే ఉన్న నాలుక వూడినట్లయింది అపార్ట్‌మెంట్ వాసుల పరిస్థితి.

**- కాయల నాగేంద్ర**

---

చిన్నకథలు



# ఊరంతా ఉగాది

**ఆ ఊరిలో** అందరికీ నలభై ఎకరాల భూమి ఉంది. ఒక్క సూరిగాడికి మాత్రం రెండు ఎకరాల పొలం మాత్రమే ఉంది. ఆ రెండు ఎకరాలలోనే వేయని పంటని వేస్తూ, తరచుగా మారుస్తూ మంచి లాభాలు గడించాడు. ఆ ఏడు ఊరిలో కొంతమంది రైతులు పత్తి, మొక్కజొన్న పంటను వేశారు. సూరిగాడు రెండు ఎకరాలలో కూరగాయలు, ఒకే ఒక్క పాయలో మాత్రం టమోటా వేశాడు.

టమోటాకు ఆ ఏడు మంచి దిగుబడి వచ్చింది. తన వాడకానికి ఉంచుకుని ఊరందరికి టమోటాలు ఉచితంగా ఇచ్చాడు. ఇంకా ఎక్కువ కాయలు కాస్తుండటంతో మార్కెట్‌కు తరలించి మంచి లాభాన్ని గడించాడు. అది చూసి ఊరిలో అందరూ టమోటా వేశారు. సూరిగాడు మాత్రం వేరే పంటను వేశాడు.

ఊహించని విధంగా ఆ ఏడు టమాటాకు మార్కెట్ లేదు.. తీవ్ర నష్టం వచ్చింది. టమోటా వేసిన రైతులు ధర లభించక రోడ్లపైనే పారబోశారు. కొందరు ఆత్మహత్యలకు పాల్పడి కుటుంబాలను శోకంలోకి నెట్టారు.

తన తోటి రైతులు ఇలా నష్టపోవడంతో చాలా బాధ కలిగింది. ఓ ఆలోచన అతని మదిలో తట్టింది. రైతులందరిని రాములోరి గుడి దగ్గరకు రమ్మని కబురు చేశాడు.

రైతులందరూ అక్కడికి చేరగానే వాళ్లను ఉద్దేశించి "సోదరులారా! టమాట పంట వల్ల మనం నష్టపోయాం. దయచేసి ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడకండి. మనకు మంచిరోజు వస్తుంది. ఈ యేడు మనమందరం వేరుశనగ వేద్దాం. మనకు గింజలు వస్తాయి, పశువులకు మేత ఉంటుంది. అందరం కష్టపడదాం" అన్నాడు. అందరూ తల ఊపారు సూరిగాడి మాటలకు. ఆ ఏడు వేరుశనగ అందరికీ లాభాలు తెచ్చి పెట్టింది. పశువులకు మేత పుష్కలంగా ఉంది. ప్రతి రైతు మోములో ఆనందం వెల్లివిరిసింది. కొందరు రైతులు ఆడపిల్లలకు పెళ్లిళ్లు కూడా చేశారు.

సూరిగాడు మళ్లీ రైతులందరిని గుడి దగ్గరకు రమ్మన్నాడు. రైతులందరూ గుడి దగ్గరకు చేరారు. అందరి కళ్లల్లో ఆనందం తొంగి చూస్తోంది.

సూరిగాడు సంతోషంతో "ఇలా మనమందరం ఐక్యంగా ఉండటం శుభ పరిణామం. పత్తి రైతు సంతోషంగా ఉన్నాడు. ఈ శుభ సమయంలో మనందరం సంతోషంగా ఉగాది జరుపుకుందాం. తదుపరి నవమి ఉత్సవాలు ఘనంగా చేసుకుందాం. నవమి అయిన తరువాత ఊరి పొలిమేరలో ఉండే ఎల్లమ్మ దేవతకు దేవర చేద్దాం" అన్నాడు. అందరూ "సరే"నన్నారు చప్పట్లు చరుస్తూ.

ఉగాది పండుగ ఆ యేడు ఊరంతా ఘనంగా జరుపుకున్నారు. రామాపురం గ్రామం ఆ చుట్టుపక్కల గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది.

**- కనుమ ఎల్లారెడ్డి**

# మత సామరస్యం

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

**వివేకానంద స్వామివారు 1893వ సంవత్సరంలో చికాగో నగరంలో జరిగిన విశ్వమత మహాసభలో పాల్గొన్న శత వార్షికోత్సవాలు ప్రపంచవ్యాప్తంగా భారతీయులు ఘనంగా జరుపుకున్నారు. మానవ చరిత్ర ఒక సంక్లిష్ట దశలో వివేకానందులవారు ఆ మహాసభలో పాల్గొన్నారు.**

ఆనాడు ప్రపంచంలోని పలు ప్రాంతాలు దాదాపు స్వాతంత్ర్యంగానే వృద్ధిగాంచాయి. ఒకదానిపై ఒకటి ప్రభావం చూపటం సంభవించినా, వాటి ప్రత్యేక లక్షణాలలో అవి జోక్యం చేసుకోలేదనే

చెప్పాలి. విజ్ఞానం పురోభివృద్ధి చెందింది. రాకపోకల వార్తా సౌకర్యాలు అభివృద్ధి చెందాయి. జాతులూ, నాగరికతలూ, దేశాలూ చేరువైనాయి. విభిన్న స్థాయిల్లో అమోఘంగా అది ఒకదానిపై ఒకటి ప్రభావం చూపసాగాయి. ఫలితంగా ఒక సమ్మిశ్రిత నాగరికత పరిణామం చెందేందుకు పునాది పడింది.

ఈ నూతన సమ్మిశ్రిత నాగరికతను వికసింపజేయడానికి ఎందరో మహాపురుషులు భారతావనిలో ఉదయించారు. గత వంద సంవత్సరాల కాలంలో మానవుల్లో బుద్ధి, సాంఘిక, రాజకీయ రంగాల్లో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యమైన మార్పు, మతం పట్ల ఆధునిక మానవుడి దృక్పథం, అలవిమీరిన సాంకేతికాభివృద్ధి, దానివలన మానవాళికి కలిగే ప్రమాదాలు, విజ్ఞాన శాస్త్ర పరిధుల ఎరుక, విద్యావంతుల దృష్టిని అటు పశ్చిమ దేశాలవారిని ఇటు ప్రాచ్య దేశాల్లోని మతాల వైపు మళ్లించింది. ప్రాచ్య దేశాలవారు తమ ఆర్థికాభివృద్ధికై పశ్చిమ దేశాల విజ్ఞాన, సాంకేతిక రంగాల వైపు తమ దృష్టిని సారించారు. వార్తారంగం ఒక విధమైన ప్రపంచ అవగాహనను, ఆలోచనా సరళిని కల్పించి, ఒక దేశానికీ మరొక దేశానికీ

దూరం తొలగించి, దగ్గర చేసింది. ప్రస్తుతం పరిశీలిస్తే ఈ ప్రపంచానికి ఈ జీవితం సంపూర్ణ దర్శనం, యథార్థత, విశ్వజనీన మానవ సమైక్యత ఆవశ్యకాలు. అందుకే విశ్వజనీన మత సిద్ధాంతాన్ని వివేకానంద స్వామివారు మానవాళికి



తెలియజేశారు. 1893లోనే విశ్వమత సభలోనే వివేకానందులవారు ప్రపంచానికి చాటారు. ఎన్నటికైనా విశ్వజనీన మతమనేది దేశకాలాతీతమై అనంతమై ఉండాలి.

కృష్ణుణ్ణి అనుసరించే వారి మీద పాపాత్ముల మీదా, అందరి మీదా తదీయ భానుదీప్తి ప్రసరించాలి. అది బ్రాహ్మణమతంగా, బౌద్ధ, క్రైస్తవ, మహమ్మదీయ మతాలుగాగానీ వుండరాదు. అయినా అభివృద్ధి గాంచడానికి అనంతమైన అవకాశం వుండాలి. ఆ మతంలో హింస, అసహనానికి తావుండదు(కూడదు).

ప్రతి స్త్రీ, పురుషునిలోని దివ్యత్వాన్ని గుర్తించి, మానవాళికి తన యదార్థ దివ్య ప్రకృతిని సాక్షాత్కరించుకోవడానికి పూర్తి అవకాశం, పూర్తి శక్తిని అని

కేంద్రీకరిస్తుంది. ఇలా స్వామి వివరించారు. విశ్వజనీన మతం అంటే స్వామీజీ అభిప్రాయం ఒక నూతన మత స్థాపన కాదు. ప్రస్తుతం వున్న మతాలు అత్యున్నత స్థాయిలో మేళవించబడి ఒక నిర్దిష్టమైన ఆకృతిని పొందడం అని అర్థం. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే తొలి మెట్టు మతాల సమైక్యత లేక సామరస్యంను నెలకొల్పటం.

అసలు మతం లక్ష్యం ప్రజల ఐక్యత. కానీ ప్రజలలో అనైక్యత, ఘర్షణలకు మతం కారణం కావడం కేవలం మతం యదార్థ ప్రకృతిని సరైన రీతిలో అవగాహన చేసుకోకపోవడమే. ప్రపంచ మతాలకు రెండు కోణాలు వున్నాయని స్వామీజీ తెలిపారు. అవి ఒకటి ఆధ్యాత్మిక కోణం, రెండోది సాంఘిక సాంస్కృతిక కోణం. ఆధ్యాత్మిక కోణం శాశ్వత మత సత్యాలైన భగవంతుడు లేక పరబ్రహ్మ, దానితో జీవాత్మకున్న సంబంధం గురించి వ్యవహరిస్తుంది. ఈ శాశ్వత సత్యాలను సాక్షాత్కరించుకొని మానవుడు తన అవివేకం, బానిసతనం, దుఃఖాల నుండి విడివడి శాశ్వత శాంతిని పొందవచ్చు. మీరు పరిశీలించి చూస్తే, శ్రీరామకృష్ణులవారు విభిన్న మత ఆధ్యాత్మిక సాధనలను అనుసరించారని తెలుస్తుంది. వాటన్నిటి ద్వారా ఏకైక పరమాత్మ సాక్షాత్కారం పొందారు. స్వామి తన అనుభవాల ద్వారా, సర్వమతాల ముఖ్య ఉద్దేశం భగవత్ సాక్షాత్కరం అనే నిర్ణయానికి వచ్చారు. అంతేకాదు, రామకృష్ణులవారు భగవంతుడు లేక పరమాత్మ ఒక్కడేననీ, విభిన్న మతాలు విభిన్న పేర్లతో ఆ పరమ సత్యం పిలవబడుతూ వుందని చూపారు. మూడు వేల సంవత్సరాలకు పూర్వమే వేదకాలంనాటి ఋషులు ఇలా చాటారు.

"ఏకం సద్, విప్రా బహుధా వదంతి' అంటే సత్యం ఒక్కటే. ఋషులు విభిన్న మతాలలో విభిన్న నామాలతో దాన్ని పిలుస్తారు. ఆధునిక కాలంలో ఈ సత్యాన్ని ప్రపంచ మతాల ప్రస్తావన మధ్యలో పునః ప్రతిష్ఠించారు. వారి తర్వాత శ్రీ వివేకానందులవారు ఈ సత్యాన్ని ప్రజలందరి ఎరుకలోకి తెచ్చారు.

భగవంతుణ్ణి సాక్షాత్కరించుకునే శక్తి అందరిలోనూ అంతర్గతంగా వుందని చూపారు. 'ప్రతి జీవిలోనూ దివ్యత్వం నర్మగర్భితంగా నిగ్రహించి దివ్యత్వాన్ని విశదపరచటమే లక్ష్యం" అంటారు. స్వామీజీ చెప్పినట్లుగా, వారి అంచనాల మేరకు మతాల సారం అంతర్గతమైన దివ్యత్వాన్ని సాక్షాత్కరించుకోవడమే.

ఈ విధంగా ఆత్మ స్థాయిలో ప్రపంచ మతాలు మౌలికమైన సమైక్యతను చూపుతాయి. కానీ మతానికి సాంఘిక, సాంస్కృతిక కోణం కూడా వుంది. వివిధ సంప్రదాయాలూ, కాల్పనిక పురాణాలుగా, అంధ విశ్వసాల, కర్మకాంతలు ఇవి సంప్రదాయాలు, ఉత్సవాలూ ఈ వర్గం కిందకు వస్తాయి. ఇవి మతానికీ మతానికీ వారి, మతాలలోని సుసంపన్నమైన వైవిధ్యానికి దారి తీస్తాయి. అత్యధిక సంఖ్యాకులు కేవలం బాహ్య రూపం మీదనే మతాన్ని గుర్తిస్తున్నారు. దురదృష్టవశాత్తు ఈ బాహ్య వ్యత్యాసాలు విభిన్న మతస్తుల మధ్య ఘర్షణలకు దారి తీయవలసిన అవసరం లేదని స్వామీజీ చూపించారు. దానికి విరుద్ధంగా మతాలలోని సాంస్కృతిక భిన్నత్వం ఒకదానికొకటి బహుమాన పూర్వాంకాలే(కాంప్లిమెంటరీ). ప్రతి మతమూ ప్రపంచ సంస్కృతికి అద్వితీయమైన కొంత ఉపకారాన్నే చేసింది. ప్రతి మతమూ ప్రపంచం సంస్కృతికి అద్వితీయమైన కొంత ఉపకారాన్నే చేసింది.

వివేకానంద స్వామివారి మాటల్లో చెప్పాలంటే.. 'మతాలు పరస్పర విరుద్ధాలు కావు, అవి పరిపూరకాలు. ప్రతి మతమూ, విశ్వజనీన సత్యంలోని ఒక విభాగాన్ని తీసుకొని తన సర్వశక్తిని వ్యయించి, ఆ మహాసత్యపు ఒక ప్రత్యేక విభాగానికి ఒక స్వరూపాన్ని సూచిస్తుంది. కాబట్టి ఇది అదనమేగానీ, వాటిని వదిలివేయటం కాదు. స్వామి మత సామరస్యం పట్ల చాటిన సిద్ధాంతం అపూర్వం. పరమతాల పట్ల సహనం వహించడమే కాదు, ఇతర మతాలలోని అంశాలను అంగీకరించి, వాటిని ధార్మిక జీవితంలో ఏకీకరించుకోవాలి. ఈ భావాన్నే స్వామీజీ ఆనాడు చికాగో విశ్వమత మహాసభలో అందరి దృష్టికీ తెచ్చారు. క్రైస్తవుడు, హిందువు లేక బౌద్ధుడు కానవసరం లేదు. కానీ అందరూ ఇతరులలోని ఔత్సాహికాన్ని(ది స్పిరిట్) అర్థం చేసుకొని తన వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ, తమ తమ విధానాల్లో పెంపుదల సాధిస్తూ పెరగాలి.

దుఃఖానికి కులం, జాతి హద్దులు తెలియవు. దుఃఖ నివారణలో ప్రపంచ మతాలకు ఒక సాధారణ బాధ్యత వుంది.

మతాన్ని సక్రమంగా అవగాహన చేసుకొని ఆచరిస్తే అది మానవాళికి మంచిని చేసే మహాశక్తిగా పరిణమిస్తుందని మనకు ఇప్పటికే అంతటా స్పష్టమైందని తెలుస్తుంది. మతం పేరిట కొందరు అవివేకులు చేసే పాపకార్యాలను సూచిస్తూ, ఏ మతాన్నీ నిందించరాదు. అది అన్యాయం. మన శాస్త్రాల్లో వివరించినట్లుగా, మతం ప్రధాన లక్ష్యం దుఃఖ నివారణం, అత్యంతిక దుఃఖ నివృత్తి.

దుఃఖానికి కులం, జాతి హద్దులు తెలియవు. దుఃఖ నివారణలో ప్రపంచ మతాలకు ఒక సాధారణ బాధ్యత వుంది. మానవాళికి మంచిని చేసే రంగంలో మతానికి పరిమితులుండరాదు. మత వ్యతిరేక దిశలో వుండక మంచిని పెంచడంలో దాని శక్తిని పెంచుదాం. స్వామి వివేకానందులవారు చేసింది ఇదే. ఈనాటి ఆధునిక భారతదేశంలో ధార్మిక శక్తిని సాంఘికంగా ఉపయోగకరంగా వుండే మార్గాల్లో, మత, వర్గ భేదాలు లేకుండా సాంఘిక సేవా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించిన మత నాయకుల్లో వివేకానందస్వామివారు ఆద్యులు. స్వామివారు మహోన్నత వ్యక్తులు. వారు ఒక మతం లేక ఒక జాతి పరిధుల్లో పరిమితం చెయ్యబడేవారు కాదు.

వారు సర్వ మానవాళికీ చెందినవారు. దుఃఖ భాజనులు ఎక్కడున్నా వారికోసం స్వామీజీ హృదయం పరితపించేది. మీరు గమనిస్తే చికాగో విశ్వమత మహా సభలో పాల్గొన్న తర్వాత స్వామీజీ జీవించిన తొమ్మిది సంవత్సరాల కాలాన్ని ఆయన నిరంతరం ప్రాచ్య, పశ్చిమ దేశాల ప్రజల సంక్షేమానికి వినియోగించారు. తన శరీర పరిత్యాగానంతరం కూడా తను దుఃఖ భాజనుల కోసమే పని చేస్తానన్నారు. స్వామివారు ప్రపంచంలోని మొత్తం స్త్రీ, పురుషుల బాగోగుల కోసమే ఆయన ఆత్మ ఇంకా పని చేస్తూనే వుంటుందని కోట్లాది వారి అభిమానులు నమ్ముతూ వున్నారు. వివేకానందులవారి మత సామరస్యం సందేశాన్ని అనేక మందిలో జాగృతం చేయడానికి అందరూ పాటుపడాలి.



## ప్యారడీ పాట

'ప్రేమనగర్' సినిమాలోని "నేను పుట్టాను లోకం ఏడ్చింది... నేను ఏడ్చాను లోకం నవ్వింది' పాటకు ప్యారడీ)

**పల్లవి:** నేను పుట్టాను లోకం షాకైంది
నేను పెరిగాను లోకం షేకైంది
నేను నవ్వాను ఈ లోకం ఏడ్చింది
నాకింకా లోకంతో పని ఏముంది.. డోంట్ కేర్.


**చరణం:** నేను పెరిగితే కొందరి నోళ్ల మూతలు పడ్డాయి
నేను తగ్గితే కొందరి కళ్లు గిరగిర తిరిగాయి
నేను పెరిగితే కొందరి నోళ్లు మూతలు పడ్డాయి
నేను తగ్గితే కొందరి కళ్లు గిరగిర తిరిగాయి
నేనే లేకుంటే అందరు నాపై జోకులు వేస్తారు
స్వీట్లను తింటూ నలుగురు చేరి
నవ్వుకుంటారు
హహహహా... డోంట్ కేర్...

**చరణం:** వద్దంటున్నా చక్కెర బొక్కి నన్నే పిలిచారూ
తీపిని చూసి మనసే నిలువక మరింత పెంచారూ
ఎరుగక తిన్నవాళ్ల వొంటికే మందులు కావాలి ॥2॥
ఇలాంటి వారి వ్యామోహానికే డాక్టర్లున్నారూ...
డోంట్ కేర్



నేను పుట్టాను లోకం షాకైంది
నేను పెరిగాను లోకం షేకైంది
నేను నవ్వాను ఈ లోకం ఏడ్చింది
నాకింకా లోకంతో పని ఏముంది.. డోంట్ కేర్!

**- కలబరిగి వేంకటభానుభూషణ్,** సికిందరాబాద్




**కస్తూరి మురళీకృష్ణ**

# అనువుకాని చోట అధికులమనరాదు

**ఆది శాస్త జేతవనంలో విహారిస్తున్న కాలం. ఆ సమయంలో భిక్షువులు ధర్మసభలో ఓ భిక్షువు గురించి చర్చిస్తున్నారు. అతడు అమిత కోపి. అతడి కోపిష్టి లక్షణం గురించి చర్చిస్తున్నారు.**

**ఆ సమయంలో శాస్త అక్కడికి వచ్చాడు. "భిక్షువులారా, ఏం చర్చిస్తున్నారు?" అని అడిగాడు.**

"భిక్షువు కోపం గురించి చర్చిస్తున్నాం" అన్నారు.

శాస్త ఆ భిక్షువును పిలిపించాడు.

"నువ్వు నిజంగా కోపిష్టివా?" అడిగాడు.

"అవును.. నేను కోపిష్టినే" సమాధానం ఇచ్చాడు ఆ భిక్షువు.

"భిక్షువులారా, అతడు ఇప్పుడే కాదు, పూర్వ జన్మలో కూడా కోపిష్టే. అందుకే శుద్ధ నాగరాజ కులంలో పుట్టిన ప్రాచీన పండితులు కూడా మూడు సంవత్సరాల పాటు మురికితో సకల దుర్గంధాలతో నిండిన పెంటకుప్పలున్నచోట జీవించాల్సి వచ్చింది" అన్నాడు శాస్త.

అక్కడ ఉన్న భిక్షువులందరికీ ఆ పూర్వ కథ తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. ఆ పూర్వ గాథను వినిపించమని శాస్త్రను అభ్యర్థించారు.

వారి అభ్యర్థనను మన్నించి పూర్వ కథను వినిపించటం ప్రారంభించాడు బుద్ధుడు.

..................

అది వారణాసిలో బ్రహ్మదత్తుడు రాజ్యం చేస్తున్న కాలం. హిమాలయ ప్రదేశంలో దద్దర పర్వత ప్రాంతంలో నాగభవనంపై రాజ్యం చేస్తున్న దద్దర రాజుకు బోధిసత్వుడు కొడుకుగా జన్మించాడు. అతడికి మహాదద్దరకుడని పేరు పెట్టారు. అతడి తమ్ముడి పేరు చిన్న దద్దరుడు. అతడిది కఠిన స్వభావం. ఆయన నాగకుమారుడిని దూషించేవాడు, బాధించేవాడు. విషపు పాము అయినందున అందరిపై విషం చిమ్మేవాడు.

చిన్న దద్దురుడి హింసాత్మక ప్రవృత్తి నాగరాజుకు తెలిసింది.

వెంటనే చిన్న దద్దురుడిని నాగభవనం నుండి వెళ్లిపొమ్మన్నాడు. కానీ మహా దద్దరుడు తండ్రిని వేడుకున్నాడు.

"చిన్నవాడు, తెలియక తప్పు చేశాడు క్షమించండి. నాగభవన బహిష్కరణ శిక్షను ఉపసంహరించుకోండి" అని బతిమిలాడేదు.

దాంతో శాంతించిన నాగరాజు బహిష్కరణ ఆజ్ఞను ఉపసంహరించుకున్నాడు.

కొన్నాళ్లకు మళ్లీ నాగరాజుకు చిన్న దద్దరుడి మీద ఆగ్రహం కలిగింది.

మళ్లీ నాగభవన బహిష్కరణ శిక్ష విధించాడు.

పెద్ద దద్దరుడు మళ్లీ నాగరాజును శాంతింపచేశాడు.

మూడవసారి మళ్లీ నాగరాజుకు చిన్న దద్దరుడి మీద పట్టలేని కోపం వచ్చింది.

మళ్లీ పెద్ద దద్దరుడు నాగరాజును శాంతింపచేయాలని ప్రయత్నించాడు. అయితే ఈసారి నాగరాజు కోపం పెద్ద దద్దరుడి పైకి మళ్లింది.

"ఈ కోపిష్టిని, అల్లరివాడిని, మర్యాద లేనివాడిని మళ్లీ నా కోపానికి గురి కాకుండా రక్షించాలని ప్రయత్నిస్తున్నావు. నువ్వు కూడా వీడితో పాటు నాగభవనం వదలివెళ్లు. వారణాసిలో పెంటకుప్పలుగా పోసేచోట మూడు సంవత్సరాలుండండి" అని ఆజ్ఞాపించండి.

ఎవరెంతగా బతిమిలాడినా నాగరాజు తన పట్టు విడవలేదు.

దాంతో చేసేది లేక అన్నదమ్ములిద్దరూ వారణాసిలో పెంటదిబ్బలు చేరారు.

పెంటదిబ్బలలో నీటికోసం, తిండికోసం తిరుగుతున్న సోదర పాములను చూసి అల్లరి పిల్లలు, పోకిరీలు రాళ్లు విసరటం ఆరంభించాడు.

అది చూసి చిన్న దద్దరుడు కోపం పట్టలేకపోయాడు. "ఈ అల్లరి పిల్లలు మనల్ని ఏడిపిస్తున్నారు. మనం విష సర్పాలమని వీళ్లకు తెలియదు. వీళ్లపై విషం జల్లి నాశనం చేసేస్తాను" అన్నాడు.

తమ్ముడిని శాంతింపచేస్తూ పెద్ద దద్దరుడన్నాడు.

"మనం మన దేశంలో లేం, మనవాళ్ల నడుమ లేం. మనం మనుషుల మధ్య ఉన్నాం. మనుషులకు మన గురించి తెలియదు. వాళ్లకు మనల్ని చూస్తే భయం. అందుకని వాళ్లు అలాగే



ప్రవర్తిస్తారు. మనం ఎంతటి శక్తిమంతులమయినా, పరాయి ప్రాంతంలో ఉన్నప్పుడు ఓర్పు వహించాలి, క్షమాగుణం ఉండాలి" అన్నాడు.

అది విన్న చిన్న దద్దరుడు శాంతించాడు. అలా మూడేళ్లు అక్కడ గడిచేటప్పటికి చిన్న దద్దరుడి కోపం తగ్గింది. శాంతుడయ్యాడు. ఆ తరువాత వాళ్లు తమ రాజ్యం చేరారు. శాంతంగా జీవించారు.

..................

కథంతా చెప్పిన తరువాత చివరకు

"ఆ కాలంలో కోపాన్ని ఆపుకోలేని చిన్న దద్దరుడు ఇప్పుడు కోపిష్టి భిక్షువు, మహాదద్దరుడు నేనే" అని చెప్పాడు బుద్ధుడు.

..................

శాస్త జేతవనంలో విహరిస్తున్నప్పుడు కాముకత్వ నిగ్రహం గురించి చెప్పారు. ఆ కాలంలో ఒకరోజు జేతవనంలో నివసిస్తున్న అయిదు వందల మంది భిక్షువులకు అర్థరాత్రి అయ్యేసరికి లైంగిక పరమైన సంకల్పాలు కలిగాయి. శాస్త రాత్రింబవళ్లు భిక్షువులు ఆలోచలనపై ఒక కన్ను వేసి ఉంచేవారు. ఆ రోజు ఆయన తన దివ్య దృష్టిలో జేతవనాన్ని పరిశీలించారు. అప్పుడు ఆయనకు దొంగలు దాగినట్టు భిక్షువులు ఆయనకు కనిపించారు.

ఆయన ఆనంద స్థవిరుడిని పిలిచారు.

"ఆనందా, భిక్షువులను సమావేశపరచు. గంధ కుటీర ద్వారం వద్ద నా ఆసనం వేసి ఉంచ" మన్నారు.

భిక్షువులందరూ సమావేశమయ్యారు.

అప్పుడు శాస్త వాళ్లను ఉద్దేశించి మాట్లాడేడు..

"భిక్షువులారా, పూర్వ కాలంలో పండితులు ఈ విషయం ఎంతో ఆలోచించారు. ఎన్నో తర్జన భర్జనలు చేశారు. ఈ విషయం గురించి ఎంతో చర్చించిన తరువాత వారు విపకర్మలు ఆచరించకూడదని నిశ్చయించారు" అన్నాడు.

అక్కడ వున్న భిక్షువులందరికీ ఆ కథ వినాలన్న కుతూహలం కలిగింది. ఆ కథను చెప్పమని వారు శాస్తను అభ్యర్థించారు. వారి అభ్యర్థనను మన్నించి శాస్త పూర్వ కథను చెప్పటం ప్రారంభించారు.

..................

పూర్వం వారణాసిలో శాస్త బ్రహ్మదత్తుడు రాజ్యం చేస్తున్న కాలం.

ఆ కాలంలో బోధిసత్త్వుడు

"భిక్షువులారా, పూర్వ కాలంలో పండితులు ఈ విషయం ఎంతో ఆలోచించారు. ఎన్నో తర్జన భర్జనలు చేశారు. ఈ విషయం గురించి ఎంతో చర్చించిన తరువాత వారు విపకర్మలు ఆచరించకూడదని నిశ్చయించారు" అన్నాడు.

బ్రాహ్మణుడిగా పుట్టాడు. ప్రసిద్ధాచార్యుడి వద్ద శిష్యరికం చేశాడు. అయిదు వందల మంది విద్యార్థులలో ప్రథముడిగా ఉత్తీర్ణుడయ్యాడు. ఆచార్యుడికి యుక్తవయసు వచ్చిన కూతురుంది. ఆయన ఆమె వివాహానికి సరైన వరుడికోసం అన్వేషిస్తున్నాడు.

తన దగ్గర చదువుతున్న విద్యార్థులలో సద్గుణ సంపన్నుడిని, సచ్ఛీలవంతుడిని ఎన్నుకుని అతడికి తన కూతురునిచ్చి వివాహం చేయాలనుకున్నాడు.

ఆయన విద్యార్థులందరినీ పిలిచాడు.

"విద్యార్థులారా, నాకు పెళ్లీడుకొచ్చిన కూతురు ఉంది. ఆమెకు వివాహం చేయాలని అనుకుంటున్నాను. వివాహంలో ఆమెకు వస్త్రాలు, అలంకారాలు కావాలి. కాబట్టి మీరు మీ ఇంట్లోంచి, బంధువుల ఇళ్లల్లోంచి విలువైన వస్త్రాలు, ఎత్తుకురావాలి. ఇది ఎవరికీ తెలియకూడదు. అందరి కళ్లు గప్పి రహస్యంగా తీసుకురావాలి".

విద్యార్థులంతా "సరే" అన్నారు.

ఆ రోజు నుంచీ పలు రకాల విలువైన వస్త్రాలు ఆచార్యుడికి తెచ్చివ్వసాగారు విద్యార్థులు.

వారు తెచ్చిన వాటన్నిటినీ వేర్వేరుగా ఉంచేవాడు గురువు.

అందరూ తెచ్చిస్తున్నారు కానీ బోధిసత్త్వుడు మాత్రం ఏమీ తెచ్చివ్వటం లేదు. చూసీ చూసీ ఆచార్యుడు ఒకరోజు బోధిసత్త్వుడిని పిలిచాడు.

"విద్యార్థులందరూ విలువైనది ఏదో ఒకటి తెచ్చిస్తున్నారు. చూడు... ఎన్నెన్ని తెచ్చిచ్చారో! నువ్వు మాత్రం ఒక్కరోజూ కూడా ఏమీ తెచ్చివ్వలేదు. ఎందుకని? నీకు గురువాజ్ఞ పాటించాలని లేదా? గురువంటే లక్ష్యం లేదా?"

గురువు అడిగిన ప్రశ్నకు బోధిసత్త్వుడు సమాధానం ఇవ్వలేదు.

"ఏం మాట్లాడవు?" రెట్టించాడు గురువు. అప్పుడు మెల్లిగా చెప్పాడు బోధిసత్త్వుడు.

"ఆచార్యా, మీకు తెలియని విషయం కాదు.. నాతో ప్రత్యేకంగా చెప్పించాలని మీరు నన్ను ప్రశ్నిస్తున్నారు" అన్నాడు వినయంగా.

"చెప్పు.. నీ నుంచి కారణం వినాలని ఉంది" అన్నారు ఆచార్యులు.

"మీరు ఎవరూ చూడకుండా వస్తువులు తెమ్మన్నారు. అంటే ఇతరులు ఎవ్వరూ చూడకూడదు. అలా చూసిన వస్తువులు తెస్తే మీరు స్వీకరించరు. కాబట్టి ఎవ్వరూ చూడకుండా తీసుకురావాలి. కానీ ఈ ప్రపంచంలో ఎవ్వరూ చూడకుండా ఏదీ చేయలేం. తనను ఎవ్వరూ చూడటం లేదని, తాను రహస్యంగా పని చేస్తున్నాననీ ఒక్క మూర్ఖుడే అనుకుంటాడు. ఈ ప్రపంచంలో పశు, పక్షులు, చిన్న జీవులు అన్నీ చూస్తుంటాయి. శూన్యమన్నది లేదు. ఒక్కడూ చూడని స్థలమంటూ లేదు. అందుకని నేను ఏదీ తేలేదు" అన్నాడు.

ఆచార్యుడు ఎంతో సంతోషించాడు.

"నాకు ధనంతో పని లేదు. కానీ సచ్ఛీలుడు, సదాచారుడు అయిన వాడికి నా కూతురిని ఇచ్చి వివాహం చేయాలని నిశ్చయించాను. నా కూతురికి నువ్వే తగినవాడివి" అన్నాడు.

అతనికి తన కూతురినిచ్చి వివాహం చేయాలని నిశ్చయించాడు. విద్యార్థులందరినీ పిలిచి వాళ్లు తెచ్చిన వస్తువులను తీసుకుపోయి ఎవరి వస్తువులు వాళ్లకి ఇచ్చేయమన్నాడు.

కథ అంతా చెప్పి శాస్త అన్నాడు చివరలో.. "స్త్రీలపై ఆసక్తి కలవారు ధర్మం విడిచారు. ధర్మపాలన పట్లనే ఆసక్తి కలవాడు స్త్రీనైనా త్యజిస్తాడు కానీ ధర్మాన్ని విడవడు".

కథ చెప్పి ఆ కాలంలో ఆచార్యుడు సారిపుత్రుడు. పండిత విద్యార్థిని నేనే" అన్నాడు.

(22వ పేజీ తరువాయి..)

## పొగడ్త-బహుమతి

అయితే ప్రశంసలోనూ మరొక రకముంది.

ఓ పెద్దాయన ఓ విందుకు వెళ్లారు. అన్నం తినడానికి ముందర ఆయన "ఆహా! వంటెవరు చేసారోగానీ చాలా బాగుంది.. రుచిగా ఉంది. అద్భుతం! అమోఘం" అని ప్రశంసించాడు.

అప్పుడు ఆయన పక్కనున్న వ్యక్తి "అదేంటండీ! అలా ఎలా చెప్తున్నారు? మీరింకా అన్నంమెతుకు ముట్టలేదు. కానీ వంట బాగుందని మీరు మెచ్చుకుంటున్నారు. ఎలా చెప్తున్నారు?" అని అడిగాడు.

దానికి ఆ పెద్దాయన చెప్పిన జవాబు.

"అన్నం తిన్న తర్వాత ప్రశంసించగలమో లేదో.. కదా! అందుకే ఇప్పుడే పొగిడేస్తున్నా!" అని వివరణ ఇచ్చాడు ఆ పెద్దాయన.

# కలలు నిజమవుతాయా?

**వాస్తువార్త**
**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**
**డా॥ దంతూరి పండరినాథ్**
**3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్**
**సెల్స్: 9885446501/9885449458**



**చంద్రమతి – హైదరాబాద్**

**ప్రశ్న: చాలామంది తమ కలలో వాళ్ల పూర్వీకులు లేదా గతించిపోయిన పెద్దవాళ్లు కనిపించారని చెప్తూ ఉంటారు. అలా కలలో కనిపించటంలో అంతరార్థం ఏమిటో తెలియక సతమతమవుతూ ఉంటారు. కొంతమంది వాళ్లకి కలలో ఈ పెద్దలు నవ్వుతూ కనిపించారని, అది శుభ సూచకమని కూడా నమ్ముతూ ఉంటారు. ఈ విషయాన్ని ఎలా తీసుకోవాలి?**

**జవాబు:** రాత్రి కలలో ఏం కనపడిందో పొద్దున నిద్ర లేచేవరకు చాలావరకు మర్చిపోతారు. కొంత మందికి పడుకోగానే నిద్ర పట్టేస్తుంది. మాకు అసలు కలలే రావు అంటారు. కొంత మందికి 'సుషుప్తావస్త'లో అంటే నిద్ర పట్టీ పట్టకుండా ఉండే సమయంలో కలలు వస్తాయి. కొంతమంది ఏదో విషయమై తీవ్రంగా ఆలోచిస్తూ ఉంటారు. దానికి సంబంధించిన కలలే వస్తాయి. కొంత మందికి డీప్ స్లీప్‌లో కలలు వస్తాయి. మరికొంత మందికి తెల్లవారుజామున కలలు పడతాయి.

తెల్లవారుజామున కలలు నిజమవుతాయన్న నమ్మకం చాలామందిలో ఉంటుంది. వీటి గురించి కలల శాస్త్రంలో మీకు ఏ సమయంలో వచ్చే కలలు ఎంతవరకు నిజమవుతాయోనన్న విషయంలో కొంత వివరణ ఉంది. కానీ దాని ప్రామాణికత ఎంతవరకు అన్నది చెప్పలేం. కానీ ఎన్నో దృష్టాంతాల వల్ల కొన్ని నమ్మకాలు కలుగుతాయి. అలా 'స్వప్న శాస్త్ర ప్రామాణికత' నమ్మయోగ్యమైనది. రాత్రి వచ్చిన కల తెల్లవారేసరికి మర్చిపోవటం సర్వసాధారణం. కానీ ఒక్కొక్కసారి ఆ మరునాడు ఒక దృశ్యం చూడటం వల్ల కానీ, ఒక సంఘటన వల్ల కానీ, ఒక శ్రవణం వలన కానీ రాత్రి వచ్చిన కల హఠాత్తుగా గుర్తుకు రావటం పరిపాటి.

## తెల్లవారుజామున వచ్చే కలలు

'తెల్లవారుజామున వచ్చే కలలు చాలావరకు నిజమవుతాయి' అని పేర్కొనటానికి ఒక కారణం ఉంది. తెల్లవారుజామున 4.30 నుండి బ్రహ్మీ ముహూర్త సమయం ప్రారంభమవుతుంది. ఉదయం నాలుగున్నర నుండి 6.00 గంటల వరకు అంటే దాదాపు ఒక గంటన్నర సమయం 'బ్రాహ్మీకాలం'. సూర్యోదయం నుండి గంటన్నర ముందు భాగాన్ని బ్రహ్మీ ముహూర్తంగా చెప్పుకోవాలి. ఈ సమయం ఆధ్యాత్మికంగా గొప్ప శక్తివంతమైనది. ఈ సమయంలో 'తథాస్తు దేవతలు' భూమి మీద సంచరిస్తూ ఉంటారు. సాయంత్రం కూడా సూర్యాస్తమయానికి 45 నిమిషాల ముందు నుండి సూర్యాస్తమయం తర్వాత 45 నిమిషాల వరకు తథాస్తు దేవతలు భూమి మీద సంచరిస్తూ ఉంటారు. అందుకని ఆ సమయంలో నిద్ర పోకూడదు. తథాస్తు దేవతలు సంచరించే ఈ సమయాలలో మనం ఏమనుకున్నా, ఏమి మాట్లాడినా, ఏమి కోరుకున్నా తథాస్తు దేవతలు మన కోరికలను మన్నిస్తూ 'తథాస్తు' అని దీవిస్తారు. అందుకే ఆ సమయంలో మంచి ఆలోచనలు, మంచి మాటలు మాట్లాడటం/వినటం.. ఇవన్నీ తప్పనిసరి. ఇదే విషయాన్ని తెల్లవారుజాము కలలకి కూడా వర్తింపచేశారు. మనం నిరంతరం ఆలోచించే విషయాలు కానీ ఇంకేమైనా కానీ తెల్లవారుజామున కలలోకి వస్తే అవి ఆలోచితంగా వచ్చినా సరే, అనాలోచితంగా వచ్చినా సరే 'తథాస్తు దేవతలు తథాస్తు అనే సమయం' కాబట్టి



అవి నిజమవుతాయి అనే నమ్మకం ఇలా వచ్చింది.

## నిద్ర-కల-ఆత్మ

ఒక మనిషికి నిద్రలో వచ్చిన కలలో 'తాను చనిపోయినట్టు' కల పడకూడదు. అలాంటి కల పడితే ఆ మనిషి హఠాత్తుగా నిద్రలో నుంచి లేచి కూర్చుంటాడు. లేదా అతనికి వెంటనే మెలకువ వస్తుంది. మన 'జీవితం.. మన ఆత్మకు ఒక కల లాంటిది'. మనిషి ఎప్పుడైతే చచ్చిపోతాడో అప్పుడు ఈ కల గంటున్న ఆత్మ మేల్కొంటుంది. ఇది ఒక ఆధ్యాత్మిక భావన లేదా ఒక ఫిలాసఫీ. ఎంత విచిత్రంగా ఉంది కదా!

## కలలో పెద్దలు కనపడితే?

మన నిజ జీవితంలో పెద్దవాళ్లు కలలో కనపడితే దానికి సంబంధించి 'ఎటువంటి కలలకు ఎటువంటి ఫలితాలు ఉంటాయి?' అనే మీమాంస సాధారణంగా అందరిలో ఉంటుంది. మరణించిన పెద్దలు కలలో కనపడితే ముఖ్యంగా 'ఏదో విషయం మనకు చెప్పటానికి ప్రయత్నిస్తున్నారని అర్థం చేసుకోవచ్చు.

ఇలాంటి కలలు వచ్చినప్పుడు సాధారణంగా చాలా మందికి ఒక విధమైన భయం వేస్తుంది. అలా కాకుండా కొంచెం ధైర్యంగా ఉండాలి. వాళ్లు మన పెద్దవాళ్లు. మనకి కీడు తలపెట్టరు. కలలు అయినా సరే, అవి అనుభూతులను కలుగచేస్తాయి. పెద్దలు కలలో నవ్వుతూ కనపడ్డా, ఎలా కనిపించినాసరే వాళ్లతో స్నేహపూర్వకంగా, అణకువగా ప్రవర్తించే ప్రయత్నం చేయాలి. అప్పుడు వాళ్ల నుండి ఏదైనా ఒక 'కమ్యూనికేషన్' వచ్చే అవకాశం ఉంటుంది. కొంచెం మెలకువ వచ్చినట్లయితే ఆ విషయాలను గుర్తున్నంతవరకు అప్పటికప్పుడు ఒక పేపర్ మీద నోట్ చేసి పెట్టుకోవాలి. పొద్దున ఆ పేపర్‌ని చూసుకుంటే మనకి చాలా విషయాలు గుర్తుకు వస్తాయి. ఇలాంటి కలలు పదే పదే వస్తుంటే, ఉదయం పూట నియమంగా ఒక సాధారణ ధ్యానంలో కూర్చుని, కలలో వచ్చిన పెద్దలను మననం చేసుకుంటే వాళ్లు చెప్పదలచుకున్నది ఏదైనా ఉంటే అది మనకు 'కమ్యూనికేట్' అయ్యే అవకాశం ఉంటుంది. అది ఎటువంటి విషయం అయినా సరే ప్రయత్నించటంలో తప్పు లేదు. ఒక్కొక్కసారి అద్భుతాలు కూడా జరగవచ్చు. ✦



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



పనులలో పురోగతి సాధిస్తారు. చేసే ప్రయత్నాలలో కొత్త వాళ్ల సలహాలు, సూచనలు మీకు మేలు చేస్తాయి. రాజకీయ పైరవీలు లభిస్తాయి. దూర ప్రయాణాలు లాభిస్తాయి. ఆధ్యాత్మిక, సంఘ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. మీ ఇష్ట దేవుళ్లకు మహాతీర్థం పొడితో అభిషేకం చెయ్యండి. దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడడానికి చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.

## వృషభం



శుభకార్యాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరుస్తారు, ప్రత్యక్షంగా పాల్గొంటారు. జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు ఏర్పడతాయి. సంతానానికి పెంపుడు జంతువులను బహుమతులుగా ఇచ్చే సూచనలు న్నాయి. కృషి, పట్టుదల కలిగి వుంటారు. గతంలో దూరమైనవారు తిరిగి మీకు చేరువయ్యే సూచనలు ఉన్నాయి.

## మిథునం



సెల్ఫ్ డ్రైవింగ్ జాగ్రత్తలు పాటించండి. విదేశీ వస్తువులు కొనుగోలు చేస్తారు. భాషా పరమైన ఇబ్బందులు ఏర్పడతాయి. న్యాయ రంగంలో వున్నవారికి అనుకూలం. ఆరావళి కుంకుమ, శ్రీలక్ష్మీ చందనంతో అమ్మవారికి పూజ చేయండి, మంచి ఫలితాలు పొందుతారు. ప్రేమ వ్యవహారాలు వివాదాస్పదం కాకుండా జాగ్రత్తలు పాటించండి.

## కర్కాటకం



రాజకీయాలు ఆకర్షిస్తాయి. పలువురి పరిచయాలు అందుకు కారణం అవుతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. తోబుట్టువులతో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి. అనుకోని సమస్యలు కలుగుతాయి. విదేశాల్లో వున్నవారికి సొంత ఇంటి కల నెరవేరుతుంది. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి.

## సింహం



ఇంట్లోనూ, కార్యాలయంలోనూ పరపతి, పేరు కోసం తపిస్తారు. చేస్తున్న ప్రతి పనికీ వంకలు పెట్టేవారే కానీ మిమ్మల్ని గుర్తించేవారు అరుదుగా ఉంటారు. మీకు రావలసిన బాకీలు వసూలవుతాయి. కొత్త రుణాల కోసం ప్రయత్నిస్తారు. అనూహ్యంగా శుభకార్యాలు, పెళ్లిపనులు ముడిపడతాయి. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

## కన్య



ఆర్థిక వ్యవహారాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి. రుణాలు కొంతవరకు తీరుస్తారు. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. దేవాలయాలు సందర్శిస్తారు. ఇంట్లో, వ్యాపార ప్రదేశంలో సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయండి. నరదృష్టి తొలగిపోతుంది. గతంలో దూరమైనవారు తిరిగి మీకు చేరువ అయ్యే సూచనలు ఉన్నాయి.

## తుల



ఆర్థిక వ్యవహారాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి. రుణాలు కొంతవరకు తీరుస్తారు. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా గుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. గతంలో దూరమైనవారు తిరిగి చేరువ అయ్యే సూచనలు ఉన్నాయి. సెల్ఫ్ డ్రైవింగ్‌లో జాగ్రత్తలు పాటించండి. భూముల క్రయ-విక్రయాలలో లాభాలు పొందుతారు. సంతాన పురోగతి బాగుంటుంది. గృహంలో సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయండి.

## వృశ్చికం



ప్రజా సంబంధాలతో కూడిన వ్యాపారాలు బాగుంటాయి. పొలం కోసం రుణాలు చేస్తారు. అధిక పెట్టుబడులు తప్పకపోవచ్చు. పోటీ పరీక్షలలో పిల్లలకి మంచి మార్కులు వచ్చినప్పటికీ వాళ్ల ఆలోచనలు మరోక విధంగా వుండటం మీకు అయోమయం కలిగిస్తుంది. సౌర కంకణం ధరించండి. ఆరోగ్యం మెరుగు పడుతుంది. జీవిత ఆశయానికి చేరువవుతారు. కొన్ని ఘన విజయాలు నమోదు చేసుకుంటారు.

## ధనుస్సు



మీకు రావలసిన వాటికి సంబంధించిన శుభవార్త వింటారు. కొన్ని కొత్త కార్యక్రమాలు చేపడతారు. ప్రయోగాత్మక సత్ఫలితాలు సాధిస్తారు. బ్యాంకు ఉద్యోగులు సకాలంలో టార్గెట్ రీచ్ అవుతారు. మహా పాశుపత కంకణం ధరించండి. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. దేవీ దేవతలకు ప్రతిరోజు ప్రథమ తాంబూలం సమర్పించండి. పిల్లలకు అనుకూలమైన మార్పులు ఉంటాయి. స్నేహితులకు అండగా వుంటారు.

## మకరం



మీ ఆలోచనలలో మార్పులు కలుగుతాయి. వ్యక్తిగత అభివృద్ధి కోసం కృషి చేస్తారు. గొప్ప స్థానాల్లో వున్నవారితో స్నేహం కలిగి వుంటారు. తద్వారా అందరికన్నా ముందు మీకు ప్రయోజనాలు వస్తాయి. గోమతి చక్రాలతో అమ్మవారికి పూజ చేయండి. ఉద్యోగంలో మార్పు కోసం పరితపిస్తారు. శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుటన ఆ బొట్టును ధరించండి.

## కుంభం




పిల్లల భద్రత విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. మీ పరపతి మీకు ఉపయోగపడకపోవచ్చు. ఊరికోసం చేసే న్యాయ ప్రయత్నాలు ఉపయోగపడతాయి. వ్యాపారాభివృద్ధి కోసం కొన్ని త్యాగాలు చేస్తారు. ఆశించిన ధన లాభం అందుతుంది. రెండోసారి రాసే పరీక్షల్లో మంచి ఫలితాలు వస్తాయి. రాజకీయాల్లో వున్నవారికి మిశ్రమ ఫలితాలు ఉంటాయి.


## మీనం




పెద్దవారి అండదండలు పొందుతారు. మీడియా సహాయం లభిస్తుంది. కీళ్ల నొప్పులు బాధిస్తాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు చిరాకు కలిగిస్తాయి. కుక్కలకి చపాతీలు తినిపించండి. బ్యాంక్ వ్యవహారాలలో అప్రమత్తంగా ఉండండి. పరిచయం లేని వ్యక్తులకు అధిక సమాచారం తెలియచేయవద్దు. సంప్రదాయమైన కొన్ని అంశాలు, పూజలు, మొక్కుబడుల పైన శ్రద్ధ చూపిస్తారు. శుభ వార్తలు వింటారు.

# ఈ వారం కా'ర్టూన్స్'


కరోనా మహమ్మారైనా.. షేర్ మార్కెట్లు పతనం
అయినా.. తట్టుకుని నిలబడేది మన దేశం మాత్రమే!


వాట్సప్‌లో వచ్చిన ప్రతీ వీడియోను ఫేక్ అని
కొట్టిపారేస్తారేం? అది మన పెళ్లి వీడియో అండీ..!!


ముచ్చ తీరి
నేయకున్నా..!!







చైనాలోని
ఎలాంగ్ బే బర్డ్స్ నెస్ట్ రిసార్ట్స్
చిత్రాలివి. సముద్ర తీరానికి దగ్గర్లో
ఎత్తయిన పచ్చని కొండల మధ్య వున్న ఈ
విల్లాల్లో ఆధునిక సౌకర్యాలు సమస్తం
ఉంటాయి. చిటారు కొమ్మన పక్షిగూళ్లను
తలపిస్తున్న ఈ విల్లాలకు పర్యాటకులు క్యూ
కడుతున్నారనటంలో ఏమాత్రం
అతిశయోక్తి లేదు.





